VISALAANDHRA VIJAYAWADA Phone No 376

1838

విశాలాంధ్ర

700411

7 సంపుటి] విజయవాడ * మార్చి 18 1959 * బుధవారం [సంచిక 355

4 పేజీలు 6 నయాపైసలు రిజిస్టర్డు నెం. A 193

మాల్దీవి పరిస్థితి

లోక్‌సభలో స్పీకర్ వాయిదా తీర్మానం త్రోసివేత

న్యూఢిల్లీ, మార్చి 17

మాల్దీ దీవుల పరిస్థితిపై చర్చించాలని నేడు లోక్‌సభలో వచ్చిన ఒక వాయిదా తీర్మానాన్ని స్పీకర్ త్రోసివేశారు

నాగపూర్ తీర్మానాల్ని వ్యతిరేకిస్తున్న కాంగ్రెసువారిపై శిక్షణా చర్యలు

న్యూఢిల్లీ, మార్చి 16

నాగపూర్ తీర్మానాల్ని బహిరంగంగా వ్యతిరేకిస్తున్నవారిపై శిక్షణాచర్యలు తీసుకొనే విషయమై నేడు కాంగ్రెసు కార్యవర్గ సమావేశంలో చర్చకు వచ్చింది

భారతప్రభుత్వ విదేశాంగ విధానంలో ప్రమాదకర ధోరణులు

లోక్‌సభలో విదేశాంగ పద్దుపై ప్రసంగిస్తూ శ్రీమతి రేణూచక్రవర్తి హెచ్చరిక

పాక్-అమెరికా సంధిపట్ల ప్రమత్తత పనికిరాదని విజ్ఞప్తి

(విశాలాంధ్ర విలేఖరి)

న్యూఢిల్లీ, మార్చి 16

ఇటీవలకాలంలో భారత ప్రభుత్వ విదేశాంగవిధానంలో, ఆందోళనకర ధోరణులు కన్పిస్తున్నాయని లోక్‌సభలో కమ్యూనిస్టు సభ్యురాలు శ్రీమతి రేణూచక్రవర్తి నేడు బడ్జెటులోని విదేశాంగశాఖ పద్దుపై జరిగిన చర్చ సందర్భంలో మాట్లాడుతూ హెచ్చరించారు

పాక్-అమెరికా ద్విపక్ష సైనిక సంధిపట్ల దేశ ప్రజలంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని రేణూ చక్రవర్తి అన్నారు. ఈ కాలంలో భారత ప్రభుత్వ వైఖరిని చూస్తే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. గత అయిదుసంవత్సరాలలోనూ అమెరికా పాకిస్తాన్‌ను ఏవిధంగా సైనిక సంధుల్లోకి యిరికించడానికి ప్రయత్నించిందో వివరించారు. ఈ సందర్భంలో ప్రభుత్వ ఉదాసీన వైఖరిని ఆమె ఖండించారు. అమెరికా ప్రభుత్వం భారతదేశంపట్ల స్నేహభావంతోనే ప్రవర్తిస్తున్నట్టు ఇటీవల ప్రధాని చేసిన ప్రకటనను రేణూ ఉల్లేఖించి "పాకిస్తాన్‌లో సైనిక నియంతృత్వానికి కారకులెవరని?" ప్రశ్నించారు. అమెరికా సహాయం లేకపోతే భారత దేశాన్ని బెదిరించడానికి నియంత అయూబ్ ఖాన్ కుదమ్ము ఎక్కడిదని అడిగారు. క్రొత్తగా ఏర్పడ్డ పాక్ అమెరికా ద్విపక్ష సైనిక సంధి భారతదేశ భద్రతకు అత్యంత ప్రమాదకరమైనదని శ్రీమతి రేణూ విస్పష్టంగా పేర్కొన్నారు. కమ్యూనిజం వ్యతిరేకత పేరుతో అనేక ఆసియా దేశాల్లో ప్రజాస్వామ్యమే రూపుమాసిపోయే స్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో ఉదాసీనత వహించడంవల్ల ఎట్టి పరిస్థితులు ఏర్పడుతాయో హిట్లర్, ఛాంబర్లెన్, డలడీర్స్ ఉదాహరణల ద్వారా మనకు చరిత్ర చాటిచెపుతోందన్నారు

ప్రజల అండ

శ్రీమతి రేణూ యింకా యిలా అన్నారు. భారత ప్రభుత్వ విదేశాంగ విధానానికి దేశ ప్రజలంతా తమ అండదండల్ని ప్రకటించారు. కాని ఇటీవల కాలంలో మన వైదేశిక విధానంలో ప్రమత్తత గోచరిస్తోంది. పార్లమెంటులో వచ్చిన ఆందోళనను సహితం లక్ష్యపెట్టకుండా ఒకవైపున పాకిస్తాన్‌లో అమెరికా రాకెటు స్థావరాన్ని నెలకొల్పుతూన్న విషయాన్ని సోవియట్ యూనియన్ వెల్లడించినప్పటికీ భారత ప్రభుత్వం ఈ విషయమై అమెరికా ప్రభుత్వాన్ని గాని ఇటు పాకిస్తాన్‌ను గాని అడిగి తెలుసుకునే పాటి శ్రద్ధ చూపకపోవడం శోచనీయ మన్నారు. ఈ రాకెటు స్థావరాలు మన సరిహద్దుల సమీపంలో నెలకొల్పుతూండడం గమనార్హమైన విషయం

ఒకవైపున పాక్, అమెరికాల మధ్య సైనిక సంధానాలవల్ల భారత దేశానికి ప్రమాదం వాటిల్లనున్నదని చెప్పినా, అమెరికా ప్రభుత్వం 'హామీ' ని పురస్కరించుకుని ఉపవిదేశాంగ మంత్రి శ్రీమతి లక్ష్మీమీనన్ దాన్ని కాదని త్రోసివేశారని శ్రీమతి రేణూ అన్నారు. సరిగ్గా ఉపమంత్రి మాటల్నే భారతదేశంలోని అమెరికా రాయబారి బంకర్ అమెరికా విధానాన్ని సమర్థించుకోడానికి ఉపయోగించుకున్నారని చెప్పారు. అలాగే అనేక విషయాలపై లోక్‌సభలోవచ్చిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పకుండా దాటవేస్తూ వచ్చారన్నారు.

"మనం పాకిస్తాన్‌తో యుద్ధాన్ని కోరుకోడంలేదు. పాకిస్తాన్‌తో సఖ్యతను వాంఛిస్తున్నాం. మన ఉభయ దేశాల ప్రజలు భ్రాతృసమానులు. అందుచేతనే మేము నెహ్రూ - నూన్ ఒప్పందాన్ని హర్షించాం. అయితే బెరూబారీ ప్రాంతాన్ని పాకిస్తాన్‌కు ధారాదత్తం చేయడానికి మేము వ్యతిరేకిస్తున్నామంటే ఆ మార్పిడి జరిగిన తీరును మాత్రమే విమర్శిస్తున్నామని అర్థం" అని శ్రీమతి రేణూ చెప్పారు

క్రొత్తసంధి ప్రకారం పాకిస్తాన్‌కు అమెరికా ఆయుధాల సప్లయివిషయమై ప్రధాని డొంకతిరుగుడు సమాధాన మిచ్చారు. మరోవైపున పాకిస్తాన్, అమెరికాతో కుదుర్చుకున్న అంతర్జాతీయ ఒప్పందాలన్నింటికి బద్ధురాలై వుందని అమెరికా విదేశాంగశాఖ ఉద్యోగి లింకన్ వైట్ ప్రకటిస్తున్నాడని శ్రీమతి రేణూ పేర్కొన్నారు. ఆగ్నేయాసియా కూటమి నిబంధనావళిలోని ఒక అంశాన్ని ఉల్లేఖిస్తూ, కాశ్మీర్‌లో గాని, లేదా పాకిస్తాన్‌లో ఎట్టి సంఘటన జరిగినా సరే కూటమి పాకిస్తాన్‌ను ఆదుకుంటుందని ఆ అంశంలో పేర్కొన్నారని రేణూ వివరించారు

ఐక్ పథకం

ఐక్ పథకాన్ని గూర్చి ప్రస్తావిస్తూ శ్రీమతి రేణూ యిలా అన్నారు. అమెరికా సైన్యాల్ని వినియోగించడం

(మిగతా 2వ పేజీలో)

ఇరాక్-రష్యా ఆర్థిక ఒడంబడిక

మాస్కో, మార్చి 16

ఆర్థిక, సాంకేతిక సహకారం విషయమై సోవియట్, ఇరాక్ ప్రభుత్వాలు నేడొక ఒప్పందం కుదుర్చుకున్నాయని "టాస్" ప్రకటించింది

నేడిక్కడ క్రెమ్లిన్ భవనంలో ఇరాక్ ప్రభుత్వం ప్రతినిధివర్గ గౌరవార్థం సోవియట్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విందు సందర్భంలో ఈ ఒడంబడిక కుదిరింది. ఈ ఒడంబడికపై ఉభయ ప్రభుత్వాల ప్రతినిధులు సంతకాలు చేశారు

ఈ ఒడంబడిక ప్రకారం, సోవియట్ యూనియన్ ఇరాక్‌కు యంత్రాలు, రసాయనిక ఆహార పదార్థాలు తయారుచేసే పరిశ్రమలు, ఫ్యాక్టరీలు మొత్తం ఎనిమిదింటిని నెలకొల్పడంలో సాంకేతిక సాహాయ్యాన్ని అందిస్తుందని మాస్కో రేడియో తెలిపింది. పోతే ఖనిజవనరులు, ఇరిగేషన్ సౌకర్యాలు, రోడ్డు కట్టడకు సంబంధించిన సర్వే జరపడానికి సోవియట్ నిపుణులు ఇరాక్ వస్తారు. పరిశ్రమలు, కళాశాలలు, వ్యవసాయం, ఇరిగేషన్, ఆరోగ్యం, ఇరాక్ పౌరులకు సాంకేతిక తరిఫీదు — ఈ విషయాలన్నింటిపైనా ఉభయ ప్రభుత్వాల ప్రతినిధులు చర్చించుకున్నారు

సమానత్వం, పరస్పర లాభం, ఇరాక్ అంతరంగిక వ్యవహారాలలో జోక్యం కల్పించుకోకుండా వుండడం అన్న సూత్రాలు ప్రాతిపదికగానే సోవియట్ ఇరాక్‌కు సహాయం చేస్తుందని ఉభయదేశాల ప్రతినిధులు వెలువరించిన సంయుక్త ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు

నాజర్, కాశిమ్ ప్రభుత్వాలకు కృశ్చేవ్ విజ్ఞప్తి

మాస్కో, మార్చి 16

సామ్రాజ్యవాద శక్తుల జోక్యానికి అవకాశం కల్పించకుండా ఐక్య అరబ్ రిపబ్లిక్, ఇరాక్ ప్రభుత్వాలు రెండూ తమ మధ్య తలెత్తిన వివాదాల్ని తామే పరిష్కరించుకోవలసిందిగా సోవియట్ ప్రధాని నికిటాకృశ్చేవ్ నేడొక విజ్ఞప్తి చేశారు

ఇరాక్ వర్తక ప్రతినిధివర్గానికి క్రెమ్లిన్‌లో సన్మానం జరిపిన సందర్భంలో కృశ్చేవ్ ప్రసంగిస్తూ, ఇరాక్‌ను అరబ్ రిపబ్లిక్‌లో కలుపుకోవాలని నాజర్ పట్టుబడుతున్నాడని అన్నారు

"డమాస్కస్‌లో ఇటీవల అధ్యక్షుడు నాజర్ చేసిన ప్రసంగాలన్నీ మా కందరికీ బాధాకరంగా వున్నాయి. కమ్యూనిజంపై చేసే దాడిలో సామ్రాజ్యవాదులు ఉపయోగించే పదజాలాన్నే నాజర్ కూడా వాడారని కృశ్చేవ్ అన్నారు

రక్తపాతంద్వారా అరబ్ కమ్యూనిస్టులు 'నియంతృత్వ' పాలన నెలకొల్పడానికి చూస్తున్నారని ఇటీవల నాజర్ డమాస్కస్‌లో ప్రసంగిస్తూ ఒక సందర్భంలో ఆరోపించిన విషయం పాఠకులకు విదితమే

తన సరిహద్దుల్లో జరిగే సంఘటనల పట్ల సోవియట్ తనకేమీ పట్టనట్లు చేతులు ముడుచుకూర్చోదని కృశ్చేవ్ స్పష్టం చేసినట్లు 'టాస్' పేర్కొన్నది. ఇరాక్-అరబ్ రిపబ్లిక్‌ల మధ్య వచ్చిన చీలిక ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకి శత్రువులైన సామ్రాజ్యవాదులకే లాభదాయకం కాగలదన్నారు

"మాకున్న అవకాశంలో, ఇరాక్‌కు, వలసవిధానంనుండి విముక్తి చెందిన ఇతర దేశాలకు స్వార్థరహితమైన ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందివ్వడానికి సిద్ధంగా వున్నాము" అని కృశ్చేవ్ చెప్పారు

కె.సి. కెనాల్ మార్చి 31వరకు బంద్ చేయబడదు

శాసనసభలో ఇరిగేషన్ మంత్రి ప్రకటన

హైద్రాబాదు, మార్చి 17

కడప - కర్నూలు కాలువలో మార్చినెల ఆఖరు వరకు నీళ్ళు వదలడానికి ప్రభుత్వం అంగీకరించినదని నేడు శాసనసభలో నీటివనరుల మంత్రి శ్రీ జె వి నరసింగరావు ప్రకటించారు

మరమ్మత్తులకై మార్చి 15 నుండి కాలువ బంద్ చేయబడుతుందని లోగడ ప్రభుత్వం ప్రకటించగా, ఏప్రిల్ 15 వరకు నీళ్ళు వదలాలని, ఇలా వదలకపోతే కాల్వక్రింద రెండవ పంట దెబ్బతింటుందని, కర్నూల్ జిల్లా రైతుసంఘమూ, ఇతరులూ ఆందోళన చేస్తున్న విషయం పాఠకులకు విదితమే

కాల్వ మరమ్మత్తు కార్యక్రమం కుంటుపడకుండా రైతులు సహకరించే షరతుపైనే ప్రభుత్వం కాల్వలో నీళ్ళు వదిలే కాలాన్ని పొడిగిస్తుందని మంత్రిగారన్నారు

శ్రీ అయ్యపరెడ్డి (కాం) 74వ నిబంధనక్రింద ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తేగా, అందుకు సమాధానంగా మంత్రి పై ప్రకటన చేశారు

కె సి కెనాల్ పునర్నిర్మాణానికై ఈయేడు 40 లక్షలు ఖర్చుచేయవలసి వుందని మంత్రిగారన్నారు. ఇందులో కొంతభాగం కేంద్రప్రభుత్వం రుణంగా ఇస్తున్నదనీ, మార్చి 31 తరువాత ఈ సహాయం లభించదని కేంద్ర ప్రభుత్వం చెప్పినందువల్ల మార్చి ఆఖరులోగా ఈ మొత్తాన్ని ఖర్చు చేసి పని పూర్తి చేయవలసివుందని మంత్రిగారన్నారు

ఈ విషయమై ప్రభుత్వం ఒక సంఘం ఏర్పాటు చేసిందని దానికి ఛీఫ్ ఇంజనీయరు కూడా హాజరయ్యారని మంత్రిగారు తెలియజేశారు. మార్చి 15లోగా పని పూర్తిచేయనందువల్ల కేంద్రంనుండి వచ్చే 5 లక్షల రూపాయల అప్పు మురిగిపోయిందని ఏప్రిల్ తరువాతకూడా పని పూర్తికాకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి మరింత నష్టం వస్తుందని మంత్రిగారన్నారు. కాని 3 వేల ఎకరాలలో పంట పాడవుతుంది కాబట్టి ఎలాగైనా మార్చి 31 వరకు కాలువ బంద్ చేయకూడదని ప్రభుత్వం నిశ్చయించింది అన్నారు

పొగాకు రైతులను ఆదుకో గలది కేంద్ర ప్రభుత్వమే

రాష్ట్ర ప్రభుత్వం ఏమీచేయజాలదని శ్రీ తిమ్మారెడ్డి ప్రకటన

హైద్రాబాద్, మార్చి 17

పొగాకు ఉత్పత్తిదారులకు ఆర్థిక సహాయంచేసే విషయంలో రాష్ట్రప్రభుత్వం ఏమీచేయజాలదనీ ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిర్వర్తించవలసిన బాధ్యత అనీ వ్యవసాయ మంత్రి శ్రీ తిమ్మారెడ్డిగారు నేడు శాసనసభలో శ్రీయుతులు రావి నారాయణరెడ్డి, ప్రగడ కోటయ్య గారలు 74వ నిబంధనక్రింద పంపించిన తీర్మానానికి సమాధానం చెప్పారు

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి తన అభిప్రాయాలు తెలియ జేస్తున్నదని కూడా శ్రీ తిమ్మారెడ్డి అన్నారు

పొగాకు ఉత్పత్తి దారులకు భూమి శిస్తు మినహాయించడం సాధ్యం కాదనీ, పంట దెబ్బతిని నష్టాలకు తక్కువ పండితేనే అలా చేయడం నిబంధనలకు విరుద్ధమనీ అన్నారు

ఇటీవల తాను గుంటూరు వెళ్ళి పొగాకు రైతులతోనూ, వ్యాపారస్థులతోనూ మాట్లాడివచ్చానని మంత్రిగారు శాసనసభకు తెలియజేశారు. ఈ సంవత్సరం పొగాకుకు ప్రత్యేకమైన ధర చెల్లించవలసిందిగా తాను వ్యాపారస్థులకు విజ్ఞప్తి చేశానని మంత్రిగారన్నారు

"నా ఈ సూచనను గూర్చి వారు ఆలోచిస్తారని ఆశిస్తున్నాను. కాని ఎవరినీ ఈవిషయంలో నిర్బంధించే హక్కు ప్రభుత్వానికి లేదు" అని తిమ్మారెడ్డి అన్నారు

అడవుల్లో రాలిపొయ్యే ఎండుటాకులకు వచ్చే వెలకూడ ఈ సంవత్సరం పొగాకుకు రావడంలేదనీ, దీనికితోడు అధికారులు రైతులనుపట్టి ఎన్నో విధాల పీడిస్తున్నారని మంత్రిగారన్నారు. ఇందువల్ల పొగాకు పండించడం మానుకోవడమే మేలు అని అనుకొనే పరిస్థితికి కూడ రైతులు వస్తున్నారని అన్నారు

అంతకుముందు ప్రతిపక్ష నాయకుడు శ్రీ రావి నారాయణరెడ్డిగారు ప్రసంగిస్తూ, వర్జీనియాపొగాకు ధరలు విపరీతంగా పడపొయ్యాయనీ, ఇందువల్ల, ఐ ఎల్ టి డి కంపెనీవారు, దళారీలు రైతులను దోచుకొంటున్నారన్నారు

శ్రీ ప్రగడ కోటయ్య మాట్లాడుతూ, గుంటూరు జిల్లాలోని బాపట్ల, కారమూన, పరుచూరు, సంతరావూరు ప్రాంతాలలో ఈ పంట బాగా దెబ్బతిన్నదనీ, ఒకసారి నవంబరునెలలోనూ, మరొకసారి జనవరిలోను పంట దెబ్బతిన్నదనీ అన్నారు

ఎకరానికి 4 వందల నుండి 5 వందల వరకు రైతుకు ఖర్చవగా, ఎంతనుండి రైతుకు వచ్చిన ఆదాయం 150 రూపాయలకు మించదు. కాబట్టి రైతులకు భూమి శిస్తు మినహాయించాలి. పొగాకుకు సక్రమమయిన ధర నిర్ణయించి, వారి గుత్త వ్యాపారస్తుల, ఐ ఎల్ టి డి వారి పట్టునుండి రైతులకు విముక్తి కలిగించాలి అని అన్నారు

మాంగనీస్‌గని యజమానులపై సెస్?

న్యూఢిల్లీ, మార్చి 16

'కార్మిక సంక్షేమ నిధికై' మాంగనీసుగనుల యజమానులపై 'సెస్' విధింపు చట్టాన్ని చేయాలనే తలంపు ప్రస్తుతం ప్రభుత్వానికి లేదని నేడు లోక్‌సభలో కార్మిక ఉపమంత్రి శ్రీ ఆబిదాలీ చెప్పారు. మాంగనీసు ఎగుమతులను అభివృద్ధిచేయడానికి ప్రభుత్వం చాల చర్యలు తీసుకున్నదన్నారు

మలేరియా సమస్యలపై ఆసియా దేశాల సమావేశం

న్యూఢిల్లీ, మార్చి 16

ప్రపంచంలోనూ, ప్రధానంగా బడుగుదేశాలలోనూ, ప్రజలను పట్టిపీడిస్తున్న భయంకర వ్యాధుల్లో ఒకటయిన మలేరియాను నిర్మూలించడానికై వైద్యనిపుణులు ప్రబల ప్రయత్నాలు చేయాలని ప్రధాన మంత్రి నెహ్రూ నేడు, ఆసియా దేశాల మలేరియా సమావేశానికి ప్రారంభోత్సవం చేస్తూ విజ్ఞప్తిచేశారు

మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి అవకాశ మున్నదనీ, అవిధంగా, కొన్ని ప్రాంతాలలోనిర్మూలించ బడిందనీ శ్రీ నెహ్రూ అన్నారు. ప్రపంచంలో కొన్ని ప్రాంతాలలో మానవ చరిత్రపై ఈ మలేరియా వ్యాధి ప్రభావంకూడ కొంతవరకున్నదని, శ్రీ నెహ్రూ అన్నారు

ఆసియా ఖండంలోని 22 దేశాల ఆరోగ్య సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటున్నారు

* * *

మాస్కో, మార్చి 16

ఆస్ట్రేలియాతో "పెట్రోవ్ ఉదంతం" తర్వాత తెగిపోయిన దౌత్య సంబంధాలను తిరిగి నెలకొల్పుకోవడానికి సోవియట్ యూనియన్, ఆస్ట్రేలియా ప్రభుత్వాలు నిశ్చయించాయని సోవియట్ అధికార వార్తాసంస్థ 'టాస్' తెలిపింది

ఇరాక్‌లో తిరుగుబాటుదార్ల సాయుధ దాడి

అరబ్ రిపబ్లిక్ నూనె కంపెనీలు కూడా ఇందుకు సాయం చేస్తున్నట్లు వార్త

బాగ్దాద్, మార్చి 16

బాగ్దాద్‌కు పశ్చిమంగా 60 మైళ్ళ దూరంలోవున్న "రామదీ" అనే పట్టణంపై కొంతమంది తిరుగుబాటుదార్లు సాయుధదాడి జరిపారని, వీరికి ఐక్య అరబ్ రిపబ్లిక్, విదేశీ నూనె కంపెనీ ఏజంట్ల ఆర్థికసహాయం లభిస్తోందనీ వార్తలు తెలుపుతున్నాయి

ఇటీవలనే తిరుగుబాటు వచ్చిన ఇరాక్ ఉత్తర ప్రాంతాలలోని మోసుల్ నూనె పట్టణానికి 250 మైళ్ళ దూరంలో సిరియా సరిహద్దుల్లో ఈ 'రామదీ' పట్టణం వుంది. ఈ పట్టణంపై గతరాత్రి మాజీ ఇరాక్ ప్రధానియైన అబ్దుల్ సలీమ్ అరఫ్ మేనల్లుడయిన రషీద్ హవాయి దాడిచేసినట్లు తెలుస్తోంది. ఈదాడిలో ఏడుగురికి బలమైన గాయాలు తగిలినట్లు అతివాద పత్రికయైన "అల్ తవారా" ప్రకటించింది

'రామదీ' రాష్ట్రం ప్రధానంగా తెగలు నివసించే ప్రాంతం. ఇరాక్-అరబ్ రిపబ్లిక్‌తో సంలీనం కావాలని ప్రచారంచేస్తున్న "బాత్ అరబ్ సోషలిస్టు పార్టీ"కి ఈ ప్రాంతం కేంద్రంగావుంది

కృశ్చేవ్‌పై నాజర్ విమర్శ

డమాస్కస్, మార్చి 16

అరబ్ రిపబ్లిక్‌లోని కమ్యూనిస్టుల్ని సమర్థిస్తూ సోవియట్ ప్రధాని కృశ్చేవ్ చేస్తున్న ప్రసంగాల్ని అరబ్ ప్రజలెవరూ నమ్మరని అధ్యక్షుడు నాజర్ నేటిరాత్రి డమాస్కస్ రేడియోలో ప్రసంగిస్తూ అన్నారు

"మేము సోవియట్ అంతరంగిక వ్యవహారాలలో జోక్యం కల్పించుకోలేదు. యితరులపైకి ఏ గ్రూపును పురిగొల్పలేదు. అటువంటప్పుడు మా దేశంలోని కమ్యూనిస్టుల్ని సమర్థించబూనుకోవడంలో మా రిపబ్లిక్ ప్రజల ఐక్యతకే సవాల్ చేసినట్లవుతుంద"ని నాజర్ చిత్రించారు

ఢిల్లీకి ఐరాస కార్యదర్శి రాక

న్యూఢిల్లీ, మార్చి 16

ఐరాస కార్యదర్శి హమర్షోల్డ్, ఈనెల 18వ తేది ఉదయం న్యూఢిల్లీకి రానున్నారు. ఈయన భారతదేశంలో నాలుగు రోజులపాటు సందర్శిస్తారు

* * *

భారతకేంద్ర పత్తి వ్యవసాయ ఉపసంఘ సమావేశం 15వ తేదిన బొంబాయిలో జరిగింది

విదేశ మారకం వినియోగంలో అక్రమాలు

న్యూఢిల్లీ, మార్చి 16

అనేకమంది పరిశ్రమాధిపతులు, ఇతరులూ, విదేశీమారకం వినియోగంలో సాగిస్తున్న అక్రమాలను విచారణచేసి వాటిని అరికట్టడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ వి ఎ నాయర్ పంపిన తీర్మానం మార్చి 28వ పార్లమెంటులో చర్చకు రానున్నది. మార్చి28న పార్లమెంటులో అనధికార తీర్మానాలపై చర్చ జరుగుతుంది. బ్యాలట్‌లో శ్రీనాయర్ తీర్మానానికి ప్రథమస్థానం వచ్చింది

న్యాసాలాండ్ ఘటనలు

కాంగ్రెసు కార్యవర్గం ఆందోళన

న్యూఢిల్లీ, మార్చి 16

ఇటీవల న్యాసాలాండ్‌లో జరిగిన దారుణఘటనలకు కాంగ్రెసు కార్యవర్గం నేడు ఆందోళన వెలిబుచ్చుతూ వాటిని ఖండించింది. ఆఫ్రికాదేశాల స్వాతంత్ర్య త్యాగాలకు తనఅండదండల్ని ప్రకటించింది

అసంఖ్యాక ఆఫ్రికా ప్రజలపై మైనారిటీ జాతియైన శ్వేత జాతి జాత్యహంకారాన్ని సుస్థిరం చేసుకోడానికి జరిపే ప్రయత్నమే ప్రస్తుత న్యాసాలాండ్ ఘటనలకు కారణమని చెప్పింది

ఆఫ్రికా దేశాలలో స్వాతంత్ర్యం పొందుతున్న దేశాలకు కార్యవర్గం స్వాగతంచెప్తూ ఒక తీర్మానంచేసింది

కాశ్మీర్ వివాదం పరిష్కారం కాకపోతే......

ప్రపంచ శాంతికే ప్రమాదం సంభవించ వచ్చునని పాకిస్తాన్ బెదరింపు

కరాచీ, మార్చి 16

భారతదేశంలో కాశ్మీర్, కాల్వనీటి తగాయిదాల విషయమై సరైన పరిష్కారం కుదరకపోయితే, ఆసియా ఖండంలోనే కాకుండా మొత్తం ప్రపంచ శాంతికి విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడవచ్చునని నిన్న పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించిన ఒక వ్యాసంలో బెదిరించింది

పాక్ విదేశాంగ విధానంపై నిన్న వ్యాసరూపంలో వెలువడ్డ ఈ సమీక్షను ఎందుచేతనో గాని పాక్ ప్రభుత్వం నేడు ఉపసంహరించుకుంది. ఈ ఉపసంహరణకు ఎట్టి కారణాన్ని తెలపలేదు. అయితే ఈ సమీక్షను ఏ పత్రికలు ప్రకటించరాదని, సమీక్ష కాపీలను తిరిగి ప్రభుత్వానికి అందజేయవలసిందిగాను పాక్ ప్రభుత్వ సమాచార శాఖ ఒక విజ్ఞప్తి చేసింది

ఈలోపుగా అంటే నేటి ఉదయానికే కొన్ని కరాచీ పత్రికలు "భారతదేశానికి పాకిస్తాన్ సరికొత్త హెచ్చరిక. కాశ్మీర్ సమస్యా పరిష్కారంలో జాప్యం జరిగితే ప్రపంచ శాంతికే ప్రమాదం సంభవించవచ్చు" అని పతాక శీర్షికలతో ఈ సమీక్షను ప్రకటించాయి

ఈ సమీక్షను పాక్ ప్రభుత్వం ముందుగా విదేశాంగమంత్రి క్వాదీర్ అనుమతిలేకుండానే విడుదలచేసినట్లు తెలుస్తోంది. క్వాదీర్ ఎక్కడికో పర్యటనకు వెళ్ళి నేటి ఉదయమే కరాచీ వచ్చాడు. పత్రికల్లో పడిన సమీక్ష వార్తను చూడ్డంతో నే ఈయన సమీక్షను ఉపసంహరించాలని చెప్పినట్లు తెలుస్తోంది

* * *

వైతరణి నదిపై భీమకుండు విద్యుచ్ఛక్తి కర్మాగారాన్ని నెలకొల్పాలని ఒరిస్సా ప్రభుత్వం పథకం తయారుచేసింది

ప్రభుత్వోద్యోగులకనీసకోర్కెల పట్ల ప్రభుత్వ ఔదాసీన్యం

కాకినాడ, మార్చి 16

పరిస్థితులను వాస్తవదృష్టితో పరిశీలించి, ప్రభుత్వోద్యోగులు వెల్లడించిన 'కనీస కోర్కెలను' ఆమోదిస్తూ వెంటనే ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ ఆంధ్ర ప్రదేశ్ ఎన్ జి వోల 4వ తరగతి ఉద్యోగుల ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘాల సంయుక్త సర్వసభ్య సమావేశం నిన్న ఇక్కడ తీర్మానించింది. తమ కోర్కెలను ప్రభుత్వ దృష్టికి తీసుకొనిరావడానికై 27న పనిని ఆపుదల దినోత్సవం జరపాలని నిర్ణయించవలసి వచ్చిందని, అయితే ప్రభుత్వం లక్షణమే ఆర్థిక సహాయం ఇస్తానని ఇచ్చిన హామీలను పురస్కరించుకొని, ఆ దినోత్సవ ఉద్యమాన్ని సకాలంలో కార్యాచరణసంఘం ఉపసంహరించుకొన్నదని, ప్రకటనలో పేర్కొన్నారు

ఇలా ఉపసంహరించుకొన్న తరువాత రెండు వారాలు గడిచినప్పటికీ, ప్రభుత్వం తన హామీలను అమలు జరపకపోవడం ఆశాభంగం కలిగిస్తున్నదని ప్రకటనలో వెల్లడించారు

విజ్ఞతతోనూ, ధైర్యంతోనూ, వాస్తవిక దృష్టితోనూ, ఉద్యమానికి నాయకత్వం వహించినందుకు కార్యాచరణ సమితిని సమావేశం అభినందించింది

విశాలాంధ్ర

బుధవారం 18-3-1959

వెనకబడిన తరగతుల అభివృద్ధి

“ఆర్థికపరిస్థితి బాగుపడితేతప్ప హరిజనులు, గిరిజనులు, తదితర వెనకబడ్డ తరగతుల వారూ పైకి రాలేరు” అని సాంఘిక సంక్షేమశాఖ పద్దును ప్రవేశపెడుతూ ఆంధ్ర శాసన సభలో మంత్రి శ్రీ పట్టాభిరామారావుగారు ఒక సూత్రం చెప్పారు. అందుకుగాను ఆంధ్ర ప్రభుత్వము కుటీర పరిశ్రమల కేంద్రాలను, సహకార సంఘాలను ఏర్పరుస్తోందని తెలియజేశారు

ఈ పథకం క్రింద వచ్చే ఏడాది కుటీర పరిశ్రమల విషయంలో 78 మంది హరిజనులకు వడ్రంగంలోనూ బుట్టల అల్లికలోనూ, 220 మందికి దుస్తులు తయారుచేయడంలోనూ శిక్షణ యిస్తారట. ఆంధ్రదేశం మొత్తంమీద 33 సహకార సంఘాలకు 33 వేలు యిస్తారట. ఇదికాక, వ్యవసాయపనిముట్లు, ఎద్దులు కొనుక్కోవటం కోసం కుటుంబానికి రు 300లు చొప్పున నూరు కుటుంబాలకు రు 30 వేలు యిస్తారట. మరి కొంతమంది వృత్తులకు కూడా వారి వృత్తుల అభివృద్ధికై సహాయం చేస్తారట - ఇదీ, సూక్ష్మంగా చెప్పాలంటే, హరిజనుల, గిరిజనుల ఆర్థికాభ్యున్నతికోసం వచ్చే ఏడాది ఆంధ్రప్రభుత్వం తలపెట్టిన పథకం

వెనకబడ్డ తరగతులకు చెందిన ప్రజలు సమాజంలో అట్టడుగున పడివుండి, దారిద్ర్యంతోనూ, అజ్ఞానంతోనూ, అనారోగ్యంతోనూ ఎంత హీన స్థితిలో వున్నారో అందరికీ తెలిసిన విషయమే. స్వతంత్రం వచ్చి పన్నెండేళ్ళయినా వీరి జీవిత పరిస్థితుల్లోనూ, సాంఘిక ప్రతిపత్తిలోనూ చెప్పుకోతగ్గ అభివృద్ధి కానరావటం లేదు.

అయినా వీరి ఆర్థికాభ్యున్నతికి దోహదమిచ్చే ముఖ్యసంస్కరణలపట్ల ఆంధ్ర ప్రభుత్వం తగు శ్రద్ధ చూపడంలేదు. పేదలకు భూములు లభ్యమయ్యే భూసంస్కరణలు తేకపోగా, కనీసం ప్రభుత్వ స్వాధీనంలో వున్న లక్షలాది ఎకరాల బంజర్లనైనా ఈ వెనుకపడ్డ తరగతులవారికి సాగుకివ్వటం లేదు పైపెచ్చు అక్కడక్కడా సాగు చేసుకొంటున్న వారినికూడా ఆ బంజర్లనుంచి వెళ్ళగొడుతున్నారు. కొంతకొంతమంది ఫీల్డు లేబర్ కోఆపరేటివ్ సొసైటీలనుపెట్టుకొని లంక భూములు సాగుచేసుకుంటూంటే, వాటిల్లో కూడా కొంతభాగం లాక్కొని ప్రభుత్వం వేలం వేస్తోంది వ్యవసాయ కూలీలకు కనీస కూలి నిర్ణయించమంటే అదీ పట్టించుకోవడంలేదు.

ఈ విధంగా హరిజనుల, గిరిజనుల ఆర్థికాభివృద్ధికి అత్యవసరమైన ప్రాథమిక విషయాలను సైతం అమలు పర్చకుండా, కుటీర పరిశ్రమలకు, సహకార సంఘాలకూ నామమాత్రమైన గ్రాంట్లిస్తూ అంతటితోనే వారి ఆర్థిక పరిస్థితులు బాగుపడతాయనటం కేవలం హాస్యాస్పదం తప్ప మరేమీ కాదు.

ద్వితీయ ప్రణాళికా సమయంలో ఆంధ్రదేశంలోని వెనకబడ్డ తరగతుల అభివృద్ధికోసం ఒకకోటి 93 లక్షల రూపాయలు కేటాయించగా గత మూడేళ్ళలోనూ ఆంధ్ర ప్రభుత్వం 70 లక్షలనుమాత్రమే ఖర్చుపెట్టింది అసలు మంజూరుచేసిన మొత్తమే తక్కువైతే ఖర్చుపెట్టడంకూడా దానికి తగ్గట్టే వున్నది ఫలితంగా ఇళ్ళస్థలాలుగానీ, మంచినీటి వసతులుగాని, ఆరోగ్య సదుపాయాలు గాని, విద్యా సౌకర్యాలుగానీ పెరగటంలేదు

హరిజనులు ఇళ్ళస్థలాల కోసం ఎన్నో ఏళ్ళక్రితం పెట్టుకున్న వేలాది దరఖాస్తులు నేటికీ మంజూరుకాకుండా మూలుగుతూనేవున్నాయి.

ద్వితీయ ప్రణాళికలో విద్యకోసం కేటాయించిన మొత్తాన్ని పూర్తిగా ఖర్చు పెట్టలేమని విద్యామంత్రి మొన్ననే శాసనసభలో వెలిబుచ్చారు. కాని, నూటికొక్కరుకూడా చదువుకున్నవారు లేని యీ వెనకబడ్డ తరగతుల్లో విద్యాభివృద్ధికి మాత్రం ఆంధ్రప్రభుత్వంపట్టించుకోవటం లేదు.

హరిజన హాస్టళ్ళ నిర్వహణ కోసమని ప్రభుత్వం గ్రాంట్లు ఇస్తున్నది. ఆ ఇచ్చే కొద్ది గ్రాంట్లయినా స్వార్థపరుల జేబుల్లోకి పోకుండా చేయటం కోసం హాస్టళ్లను ప్రభుత్వమే నిర్వహించాలని ఎంతో కాలం నుంచి ఆందోళనజరుగుతున్నది. అయినా ప్రభుత్వం వినిపించుకోవటం లేదు.

ఈ నిర్లక్ష్యాన్ని విడనాడి ఆంధ్ర ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించనంతకాలం, వెనకబడ్డ తరగతుల ఆర్థికాభ్యుదయం కోసం భూసంస్కరణలు, బంజర్ల పంపకం మున్నగువాటిని అమలుపర్చనంతకాలం, ఎన్ని బడ్జెటులు ప్రతిపాదించినా, ఎన్ని పథకాలు తయారుచేసినా 'సాంఘికసంక్షేమ'మనేది చిలక పలుకుల్లాగానే దిగబడిపోతుంది.

భారతదేశంలో అణుశక్తి ఉత్పత్తి

లోక్‌సభలో ప్రధాని నెహ్రూ వివరణ

న్యూఢిల్లీ, మార్చి 16

అణుశక్తికి సంబంధించి నంతవరకు భారతదేశం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, ఈ అభివృద్ధి మన భవిష్యత్తుకు మంచి హామీయని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో అణుశక్తి శాఖకు సంబంధించిన పద్దుపై జరిగిన చర్చ అనంతరం మాట్లాడుతూ చెప్పారు

భారత-కెనడాలసహాయంతో నిర్మితమవుతున్న అణురియాక్టర్ గనుక పూర్తిగా పని ప్రారంభిస్తే భారతదేశం ప్రపంచంలో 'ఇసోటోప్'లను వుత్పత్తి చేసే పెద్దదేశాలలో ఒకటిగా తయారవుతుందన్నారు ట్రాంబేలోని అణుశక్తి కర్మాగారం తగు ప్రాధాన్యతగల పరిశోధన శిక్షణా కేంద్రంగా రూపొందిందన్నారు ఈ కర్మాగారంలో భారత శాస్త్రజ్ఞులకు అత్యుత్తమ సాంకేతిక తర్ఫీదు ఇవ్వబడుతోందన్నారు పరిపాలనా బాధ్యతలకు శాస్త్రవేత్తలు అతీతులుగా వుండాలనడం సరైన అభిప్రాయం కాదన్నారు ట్రాంబే కర్మాగారం దానికి కావలసిన ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటినీ ఉత్పత్తి చేసుకోగలుగుతుందన్నారు. మరో రెండు సంవత్సరాల్లో ఈ విషయంలో స్వయం పూర్ణత్వం సిద్ధిస్తుందన్నారు

కమ్యూనిస్టు సభ్యుని సూచన

అంతకుముందు కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ వి పి నాయర్ మాట్లాడుతూ, “మోనోజెట్” యిసుక (అణుశక్తి సంబంధించిన పదార్థం)ను ఎగుమతి చేయడానికి క్విలన్‌నుండి ఎర్నాకుళంవరకు 6 మైళ్ళ పొడవుగల రైలుబాట నిర్మించటం లక్షణం అవసరం అని సూచించారు. “ఇలమనైట్” ఉత్పత్తికిగాను భారత ప్రభుత్వం “హిందుస్తాన్ అండ్ విలియమ్స్ లిమిటెడ్” ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోవాలన్నారు ఈ ఫ్యాక్టరీ పని సంతృప్తికరంగా జరుగుటంలేదని శ్రీ నాయర్ చెప్పారు

వావిలవాలంలోని పాలిటెక్నికల్ విద్యాలయాన్ని వచ్చే సంవత్సరం నాగ [illegible]

టోకువ్యాపారులపై విశ్వాసం ఉంచాలనే దృక్పథమే తప్పు

విచారణకమిటీ నివేదికపై కేరళ శాసనసభలో శ్రీ నంబూద్రిపాద్ ప్రసంగం

తిరువనంతపురం, మార్చి 16

“బియ్యం కొనుగోలు విచారణ కమిటీ నిర్ణయాలు, ధాన్యం టోకు వ్యాపారస్తులలో సంపూర్ణ విశ్వాసముంచాలనే దృక్పథంపై ఆధారపడి వున్నాయి. ఇది ఆహార సమస్యపై కేంద్రప్రభుత్వం నిశ్చయించిన విధానానికి విరుద్ధం. అందువల్ల కేరళ ప్రభుత్వం ఈ దృక్పథాన్ని అంగీకరించజాలదు” అని కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ నేడు శాసనసభలో ఉద్ఘాటించారు.

మెజారిటీపార్టీ, మెజారిటీ కోల్పోనంతవరకు పరిపాలన సాగించాలనేదే ప్రజాస్వామ్య మూలసూత్రం. ఈ సూత్రాన్ని ప్రతిపక్షాలు కూడ మన్నించి, కమ్యూనిస్టుపార్టీని పాలించనివ్వాలి అని కూడ శ్రీ నంబూద్రిపాద్ అన్నారు

బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంలో ప్రతిపక్షాలవారు, పదేపదే ఆంధ్ర బియ్యం కొనుగోలు విచారణ కమిటీ నివేదికను గూర్చి ప్రస్తావిస్తూ కేరళ ప్రభుత్వం వెంటనే రాజీనామా చేసి ఎన్నికలకు నిలబడవలసిందిగా సవాలు చేశారు ఈ సవాలుకు ముఖ్యమంత్రిపైవిధంగా సమాధానమిచ్చారు

శ్రీ నంబూద్రిపాదు, కమిటీ నివేదికలో ప్రధానంగా రెండు నిర్ణయాలున్నాయని అన్నారు “ఒకటి ప్రజల ధనం అపహరణ కాలేదు రెండు ఈ లావాదేవీల్లో ప్రభుత్వానికి కొంత నష్టం వచ్చింది, ఈ నష్టం అనివార్యమయిందికాదు ప్రజాధనం అపహరణ జరిగిందని రుజువు చేయడానికి ప్రతిపక్షాలు చేసిన ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి ఈఆరోపణను రుజువు పరచేందుకు వివిధమైనసాక్ష్యాధారాలు లేవని కమిటీ నిక్కచ్చిగా చెప్పింది కంట్రాక్టర్లు చెప్పిన ధరలువ్యాపారులకు ముట్టచెప్పలేదని అవి ప్రభుత్వంలోని వ్యక్తులు కాజేశారని ప్రతిపక్షాలవారు కమిటీముందు చెప్పారు అదికూడ రుజువు కాలేదు ఇక నష్టాన్ని గురించి చెప్తూ, కేరళ వ్యాపారులు ఈసందర్భంలో సమర్పించిన పథకమే బాగుందని ప్రతిపక్షాలవారు కమిటీ ముందు సాక్ష్యమిచ్చారు కాని ధరలు నిలకడలేవనే విషయాన్ని కమిటీ అంగీకరించక తప్పలేదు అయితే “కేరళలోని ధాన్యం టోకు వ్యాపారులందరూ మర్యాదగా ప్రభుత్వాన్ని మోసంచేసి వుండరు.” అని కమిటీ అభిప్రాయ పడింది అంటే కమిటీకి టోకు వ్యాపారులలో సంపూర్ణ విశ్వాస ముందన్నమాట

“ఇక్కడ ధాన్యం వ్యాపారానికి సంబంధించిన విధానాల ప్రసక్తి వస్తోంది. గతానుభవం దృష్ట్యా చూస్తే, ఏ ప్రభుత్వానికి టోకు వ్యాపారస్తులయందు గాని, కమిషన్ ఏజెంట్లయందు గాని, నమ్మకముంచడం అసాధ్యం. ఆహార ధాన్యాలకు కొరత ఏర్పడిన ప్రస్తుత పరిస్థితులలో, ఈ వ్యాపారమంతా, టోకు వ్యాపారస్తుల చేతుల్లో వదలిపెట్టడం మంచిదికాదు కేంద్ర ప్రభుత్వం కూడ ఈ విషయం అంగీకరించిన మాట అందరికీ తెలుసు రాష్ట్ర ప్రభుత్వ విధానం ఇందుకు అనుగుణ్యంగానే వున్నది అందువల్లనే విచారణకమిటీ దృక్పథాన్ని, కేరళ ప్రభుత్వం ఆమోదించజాలదనే నేను స్పష్టంచేయదలచాను కాబట్టి ప్రభుత్వం సిగ్గుపడవలసిన విషయమేదీ విచారణ కమిటీ నివేదికలో లేదు ”

ఈ సందర్భంలో శ్రీ నంబూద్రిపాద్ ప్రజాస్వామిక పాలనలోని ప్రధాన సూత్రాలను వివరిస్తూ ఇలా అన్నారు

“ప్రజాస్వామ్యమంటే పరిపాలనా విధానానికి సంబంధించిన విషయాల్లో ప్రజలదే తుదిమాట ఇందులో ప్రజల హక్కులను ఎవరూ కాదనలేరు కాని ప్రతిపక్షంవారు అన్ని విషయాల్లోనూ, విధానాలు రూపొందించే విషయంలో కూడ న్యాయాధికారులకే సర్వహక్కులున్నాయని వాదిస్తున్నారు ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్యవాదీ ఈ వాదనను అంగీకరించడు

“విధానాలురూపొందించే హక్కు ఒక్క ప్రజలది, ప్రజలచే ఎన్నుకోబడిన శాసనసభలది, శాసనసభలో మెజారిటీగల ప్రభుత్వంది వీరికి తప్ప ఇతరులకు ఆ హక్కు వున్నదనడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం ప్రభుత్వం ప్రజాస్వామ్యసూత్రాలకువ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది కాబట్టి న్యాయాధికారులు తప్ప ప్రజలకు విముక్తి కలిగించేవారు మరొకరు లేరని ఒక ప్రతిపక్ష సభ్యుడన్నాడు ఈ సందర్భంలో ఏమిచేయాలో రాజ్యాంగం [illegible] ప్రకారం మనమంతా వ్యవహరిద్దాం మెజారిటీగల ఎన్నుకోబడినపార్టీ మెజారిటీ కోల్పోనంతవరకు అయిదేళ్ళు పరిపాలించాలని రాజ్యాంగచట్టంలో వుంది. మెజారిటీ లేనివారు సహనం వహించి వుండాలి.

1947 నుండి కాంగ్రెస్ ఈదేశాన్ని పరిపాలిస్తూ వచ్చింది తాముతప్ప ఇతరులెవ్వరూ ఈదేశాన్ని పరిపాలించే హక్కు లేదన్నట్టుగా కూడ ఆ పరిపాలన సాగింది మీకు ఓట్లలో కాని, శాసనసభ సీట్లలో కాని మెజారిటీ లేకనే పాలించిన ఆ రోజుల్లో మీరు ఆడిన ఆటలన్నీ మాకు తెలియవనుకొన్నారా ?” అని శ్రీ నంబూద్రిపాద్ ప్రతిపక్ష నాయకులవైపుతిరిగి ప్రశ్నించినపుడు సభ్యులు అంతా గొల్లుమని నవ్వారు

రాజీనామా చేయాలనే నినాదం అంతరార్థం

కేరళ కమ్యూనిస్టు కమిటీ ప్రకటన

తిరువనంతపురం, మార్చి 16

రాష్ట్రంలోని అభివృద్ధి నిరోధక శక్తులు, కేరళ భూసంస్కరణల బిల్లు మొదలగు అభ్యుదయకరమైన బిల్లులు శాసనరూపం ధరించకూడదనే దుర్బుద్ధితో, బియ్యం కొనుగోలు విచారణ కమిటీ నివేదికను సాకుగా తీసుకొని 'ప్రభుత్వం రాజీనామా చేయాలి' అనే నినాదాన్ని చేపట్టాయని కేరళ కమ్యూనిస్టు కమిటీ కార్యవర్గం ప్రజలను హెచ్చరిస్తూ నేడొక ప్రకటన చేసింది

“ఈ సందర్భంలో కేరళ ప్రభుత్వం చేసిన నిర్ణయాలను ప్రజలు బలపరుస్తున్నారని మాకు సంపూర్ణ విశ్వాసమున్నది బియ్యం కొనుగోలులో ప్రజాధనం అపహరణ జరిగిందని ప్రతిపక్షాలవారు ఆరోపణ చేశారు. అది యదార్థం కాదని రుజువయింది కాని ఈ కొనుగోలు ఎలా జరగాలనే విషయాలపై కమిటీ వెలిబుచ్చిన దృక్పథం కమ్యూనిస్టు పార్టీ ఆమోదించజాలదు టోకు వ్యాపారంపైన సంపూర్ణ విశ్వాసముంచాలన్న విషయం ప్రస్తుత ఆహార పరిస్థితిలో అనుసరణీయమయినది కాదు ” అని కార్యవర్గం ప్రకటన చేసింది

రేణుకా చక్రవర్తి ప్రసంగం

(1వ పేజీ తరువాయి)

అంత తేలిగ్గాదనే విషయమై పెద్దగా చెపుతున్నారు కాని చివరకు అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ సహితం ఈ రోజుల్లో ప్రధానమైనవి అణ్వాయుధాలు కాని సైన్యాలు కావని స్పష్టంగా చెప్పుతున్నారు. లెబనాన్‌లో అమెరికా సైన్యాలు దిగడానికి ఈ ఐసెన్‌హోవర్ పశ్చిమాసియాపథకమే కారణమన్న సంగతి మనం గుర్తించుకోవాలన్నారు ఆనాడు లెబనాన్‌లో 'కమ్యూనిస్టు దురాక్రమణ' ఎక్కడిది? పాక్‌తో అమెరికా కుదుర్చుకున్న సైనికసంధి భారతదేశం పట్ల శత్రు చర్యగా గుర్తించబడుతుందని మనమేమన్నా స్పష్టంగా ప్రకటించామా అని ప్రశ్నించారు సామ్రాజ్యవాదులు మన మానవ మనల్ని బ్రతుకనిస్తే, పాకిస్తాన్‌తో మనకున్న విభేదాల్ని పరిష్కరించుకోవడం సాధ్యమన్నారు.

ఇండో చైనా పరిస్థితిగూర్చి, థాయ్‌లాండ్‌లో ఆగ్నేయాసియా కూటమికి చెందిన విమానాలు, అణ్వస్త్రాలతో జరుపుతున్న విన్యాసాలను గూర్చి కూడా శ్రీమతి రేణు ప్రస్తావించారు.

టిబెటు వ్యవహారాలు.

బ్రిటిష్ జర్నలిస్టు పాత్ర

ఆ తర్వాత శ్రీమతి రేణూ “స్టేట్స్‌మన్” పత్రికలో జార్జి ప్యాటర్సన్ అనే బ్రిటిష్ జర్నలిస్టు వ్రాసిన లేఖను గూర్చి ప్రస్తావించారు ఆ లేఖలో ఆయన టిబెట్ వ్యవహారాల్ని గూర్చితను భారత అధికారులలో సంప్రదించినట్లు వ్రాశారు చైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న ప్రమాదకర కుట్రలలో ఈ జర్నలిస్టుకు పాత్రవుందని ఆమెచెప్పారు ఇది వాస్తవం కాదని ఉపమంత్రి చెప్పగా, ఆయనప్పుడు పాటర్సన్ లేఖలోని విషయాల్ని ప్రభుత్వం ఎందుకని ఖండించలేదు అని శ్రీమతి రేణూ ప్రశ్నించారు

విదేశాంగ వ్యవహారాలశాఖకు సంబంధించిన రు. 25 కోట్లు పద్దులపై నేడు లోక్‌సభ ఆరుగంటలపాటు చర్చ జరిపింది

ఈ సందర్భంలో ప్రధాని నెహ్రూ ప్రసంగిస్తూ, విదేశాంగ వ్యవహారాలకని ప్రత్యేకంగా కేటాయించిన మొత్తం రు 9 కోట్లు అంతపెద్ద మొత్తమేమీ కాదన్నారు. ఈ శాఖపై భారత ప్రభుత్వం పెడుతున్న ఖర్చు అనేక యితర దేశాలు ఖర్చుచేసిన దానికన్నా చాల తక్కువన్నారు.

కమ్యూనిస్టు సభ్యురాలు శ్రీ రేణూ చక్రవర్తి మాట్లాడుతూ, పుదుచ్చేరిని భారత దేశంలో లీనంచేసే విషయమై ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోనాలన్నారు

పి. ఎస్. పి సభ్యుడు శ్రీ అశోక మెహతా మాట్లాడుతూ, భారతప్రభుత్వ విదేశాంగవిధానం కొంత మందకొడిగా నడుస్తోందన్నారు.

ఆసియా గడ్డపై పాకిస్తాన్‌తో అమెరికా కుదుర్చుకున్న సైనిక సంధులాంటివి ఈ ప్రాంతంలోని దేశాల మధ్య విభేదాలను సృష్టించడానికి ఉద్దేశించబడ్డవే నన్నారు ఆఫ్రికాదేశాల స్వాతంత్ర్య సముపార్జనకై భారత ప్రభుత్వం చేయూతనివ్వాలన్నారు.

శ్రీ జోకిమ్ఆల్వా (కాం) ఆసియాలో జాతీయ స్వాతంత్ర్యశక్తులు తలెత్తడంతో శ్వేతజాతి ఈప్రాంతాన్ని విడిచిపోవలసివచ్చింది అలాగే ఆఫ్రికాలో కూడా శ్వేతజాతికి కొంత రక్తపాతంతో స్వస్తి చెప్పడం ఖాయం అన్నారు

ఇటీవల కెన్యా, న్యాసాలాండ్‌లో జరిగిన సంఘటనల్ని గూర్చికూడ ప్రస్తావించారు మనం ఈ సందర్భంలో ఆఫ్రికా ప్రజావాణికి అండగా నిలబడాలన్నారు బెర్లిన్ సంక్షోభం విషయమై ఆందోళన వెలిబుచ్చారు.

ప్రేక్షకుల నుర్రూతలూగించిన రష్యావారి బొమ్మలాట

హైదరాబాద్, మార్చి 17

నిన్నరాత్రి సోవియట్ బొమ్మలాట ప్రదర్శన సందర్భంలో, ప్రదర్శనశాల ప్రేక్షకులతో కటకటలాడింది అనేకులు టిక్కెట్లు దొరక్క ఆశాభంగంతో వెనుదిరిగి పోవలసివచ్చింది “అల్లాఉద్దీన్, మాజిక్‌లాంటరన్” అనే కథను ప్రదర్శించారు

నాటకరంగాలంకరణలోనూ, ఇతర విషయాలలోనూ, ప్రదర్శకులు చూపెట్టిన విశిష్టత ప్రేక్షకులనెంతో ముగ్ధులను చేసింది నిజంగా నాటకంలో ఉన్నామా అన్నట్లు ప్రేక్షకులకు స్ఫురించింది

ప్రతిపాఠ రంగం అయిపోయి, తెర పడగానే ప్రేక్షకులు ఒక్కపెట్టున హర్షధ్వానాలు చేస్తూవచ్చారు

ఇంద్రజాలికుని లాంతరు నుంచి పర్వత శిఖరం రాకాసి బయల్వెడి నప్పుడు అల్లావుద్దీన్ సుల్తాన్ రక్షణ భటులను కృపాణ హస్తుడై ఎదుర్కొన్నప్పుడు ప్రేక్షకుల సంభ్రమాశ్చర్యాలకు మేరలేదు. కరవాలాలు ఒండొంటిని ఆకినప్పుడు నిప్పురవలు ఎగజిమ్మడం మరీ ఆశ్చర్యకర మయినవిషయం

ప్రదర్శనానంతరం ఆరోగ్యమంత్రి శ్రీ కె వి రంగారెడ్డి ఆవ్‌రాట్ జోవస్కీకి పూలమాలవేసి సత్కరించారు ప్రదర్శన అద్భుతంగా వుందని అంటూ మంత్రిగారు ప్రసంగించారు

ఆవ్‌రాట్ జోవ్‌స్కీ ఉచితంగా సమాధానమిస్తూ, సాంస్కృతిక సంబంధాల ద్వారా, రష్యా భారతదేశాల మధ్యగల స్నేహసంబంధాలు మరింత దృఢతరంగా కాగలవని అన్నారు

ఐక్య జవుళి కార్మిక సంఘం సభ్యత్వం

బొంబాయి, మార్చి 14

బొంబాయి జౌళి కార్మికుల ఐక్య కార్మిక సంస్థయైన గిర్నికాంగార్ యూనియన్‌లో మార్చి 1వ తేదీ నాటికి 87 వేలమంది సభ్యులు చేరారు

ప్రజాసోషలిస్టుపార్టీ నాయకుడు శ్రీ జోషి అధ్యక్షుడుగానూ, కమ్యూనిస్టు నాయకుడు శ్రీ డాంగే కార్యదర్శిగాను ఈ ఐక్య కార్మిక సంఘం రూపొందిన విషయం పాఠకులకు విదితమే.

జౌళి కార్మికులలో పనిచేస్తున్న జాతీయ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ వారి పోటీ సంఘంలోని సభ్యులు 22 వేలు మాత్రమే కావటం కూడా గమనార్హం

ప్రశ్నోత్తరాలు

కార్మికుల గృహ నిర్మాణ పథకాలు

డబ్బు వ్యయంకాని వైనం

హైదరాబాదు, మార్చి 17

ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో, కార్మికుల గృహనిర్మాణ పథకాలకు కోటి 81 లక్షలు కేటాయించగా, మొదటి మూడేండ్లలో 50 లక్షలకు మించి ఎందుకు ఖర్చు కాలేదని పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారి ప్రశ్నకు సమాధానం చెప్పడానికి నోటీసు కావాలని నేడు ప్రశ్నోత్తరాల సమయంలో అన్నారు

శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా పారిశ్రామిక కార్మికుల గృహనిర్మాణ పథకాలకై ప్రథమ పంచవర్ష ప్రణాళికలో 168 లక్షలు కేటాయించగా, ద్వితీయ ప్రణాళికలో 181 లక్షలు కేటాయించారని శ్రీ సహకార మంత్రి వెల్లడించారు.

మంచినీటివసతి, విద్యుచ్ఛక్తి సరఫరా మొదలగు వసతులు లేనందువల్ల, విజయవాడలో కార్మికుల కోసం కట్టబడిన ఇళ్ళు ఖాళీగా వున్నవని మంత్రిగారన్నారు ఈ ఇళ్ళు వున్న స్థలం వూరికి దూరంగావున్న మాట వాస్తవమేననీ, వీటికి పైవసతులు కల్పించేందుకై విజయవాడ మున్సిపాలిటీకి కొంత గ్రాంటుఇప్పించాలని రాష్ట్రప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రిగారు తెలియజేశారు

వరంగల్లు జిల్లాలో 'పంచాయితీలు

వరంగల్లు జిల్లాలో 86 పంచాయితీలకు పాత పంచాయితీ చట్టంప్రకారం ఎన్నికలుజరిపించామని, వాటికి పంచాయితీబోర్డులు మాత్రం ఇంకా ఏర్పరచలేదని శ్రీ ఎస్ వి. కె. ప్రసాద్ ప్రశ్నకు సమాధానం చెప్పుతూ స్థానికసంస్థల మంత్రి చెప్పారు

గ్రామ పెద్దల శిక్షణకోసం 57-58లో 800 శిక్షణా కేంద్రాలు నిర్వహించామని, ఇందులో 40 వేల మంది అభ్యర్థులు శిక్షణ పొందారనీ ప్రణాళికా మంత్రి ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ తెలియజేశారు

, “భోజనం చేసి ఉపన్యాసాలు విని, వెళ్ళడమే గాని, ఉపయోగం లేదు,” చాలామంది సభ్యులు అని అనగా, ఈ శిక్షణకేంద్రాలు ఉపయోగకరంగా ఉన్నట్లే అంటున్నారు అని మంత్రిగారన్నారు

గోదావరి జిల్లాలో 120 సహకార సంఘాలు రద్దుచేయబడినవని, శ్రీ తిరుపతిరావు అడిగిన ప్రశ్నకుసమాధానంగా సహకారశాఖా మంత్రి తెలియజేశారు.

తెలంగాణాలో 21 టెనెంట్ ఫార్మింగ్ సొసైటీలు, జాయింట్ ఫార్మింగ్ సొసైటీలు, 94సమిష్టి వ్యవసాయక్షేత్రాలు ఉన్నవని ఎస్ వి కె ప్రసాద్ ప్రశ్నకు సమాధానమిస్తూ సహకార మంత్రి తెలియజేశారు

జోర్హాత్ లో అరెస్టులు

జోర్హాట్, మార్చి 16

ప్రభుత్వ భూపంపకవిధానానికి వ్యతిరేకంగా జరిగిన సత్యాగ్రహోద్యమ సందర్భంలో జోర్హాట్ పోలీసులు నేడు 103 గురు రైతుల్ని అరెస్టు చేశారు

అరెస్టయినవారిలో జోర్హాత్ జిల్లా రైతుసంఘ ఉపాధ్యక్షుడు శ్రీ కీర్తినాద్ బార్డోలియా కూడా వున్నారు

పాక్ - అమెరికా సైనిక సంధి

రక్షణకు ఉద్దేశించినట్టిది కాదని రష్యన్ ప్రతినిధివర్గ నాయకుని హెచ్చరిక

శ్రీనగర్, మార్చి 16

ఇటీవల పాకిస్తాన్ - అమెరికా దేశాలమధ్య కుదిరిన ద్విపక్ష సైనికసంధి ఎంతమాత్రమూ రక్షణకు ఉద్దేశించబడ్డ ఒడంబడిక కాదని కాశ్మీర్‌లో పర్యటిస్తున్న సోవియటు ప్రతినిధివర్గ నాయకుడు ఎ ఎ. ఆంద్రియేవ్ నేడిక్కడ నొక్కి చెప్పారు.

పాకిస్తాన్ పొరుగున వున్న దేశాలు శాంతి, భద్రతల కోసం పరితపించే శాంతి కాముక దేశాలని ఆంద్రియేవ్ అన్నారు

ఆంద్రియేవ్ ప్రతినిధివర్గానికి వీడ్కోలనిస్తూ వారి గౌరవార్థం ఏర్పాటైన విందులోప్రసంగిస్తూ ఆయన పైవిధంగా అన్నారు

“పాకిస్తాన్‌కు ఎట్టిదాడిప్రమాదమూ లేదన్న విషయం ప్రతి ఒక్కరికీ స్వయంగా తెలిసినవిషయమే అటువంటప్పుడు ఈ సైనికసంధి పాకిస్తాన్ పొరుగునవున్న శాంతికాముకదేశాలకు, సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగాను ఉద్దేశించబడ్డదనే మేము భావిస్తున్నాం జాతీయాభివృద్ధిని కోరుకుంటున్న దేశాలకు ఈసంధి ఏమాత్రమూ సహాయకారి కాదు

“సైనిక సంధుల్ని కుదుర్చుకోవడం, సైనిక కుట్రలు పన్నడం అనే పద్ధతి - దేశాలకు సంక్షేమ, సౌభాగ్యాల్ని ప్రసాదించలేదు దేశాలమధ్య స్నేహ, సహకార సంబంధాల్ని పెంపొందించుకోవాలనే పంథాను అనుసరిస్తున్న భారత మహాప్రజలకు మా హృదయపూర్వక అభివందనలు తెలుపుతున్నాం”అని ఆంద్రియేవ్ అన్నారు.

“కాశ్మీర్ ప్రజలు, యావద్భారత ప్రజలు, సోవియట్‌దేశ ప్రజలూ, శాంతికాములు. దేశాలమధ్య శాంతి, స్నేహభావాలను కోరుతున్న ప్రతి ఒక్కరిలోను వారు స్నేహ హస్తాన్ని చాచి వుంచుతున్నారు శాంత్యభిలాష, పరస్పర అవగాహన, సుహృద్భావం- అనేవి ప్రపంచంలో ఏమూలనైనా అవశ్యం కావలసిన పదార్థాలని సోవియటు ప్రజలు, భారత ప్రజలూ భావిస్తున్నారని” అన్నారు

“దురదృష్టవశాత్తు కొన్ని దేశాలు ఈ విధానానికి దూరంగా వున్నాయి. పరస్పర అవగాహనకు, ఒకరిలో ఒకరికి నమ్మకం పెంపొందించుకోడానికి సైనిక సంధులే అవసరమని భావించే రాజ్యాంగ వేత్తలు, ప్రభుత్వాలూ వున్నారు ఇందుకు పాక్ అమెరికా ద్విపక్ష సైనిక సంధియే ప్రత్యక్ష తార్కాణ”మన్నారు

అంతకుముందు కాశ్మీర్ ప్రధాని శ్రీ బక్షీగులాం మహమ్మద్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్నేహాన్ని అవగాహనను పొందించేందుకై సోవియట్ యూనియన్, కాశ్మీర్ లమధ్య ఏర్పడ్డ సన్నిహిత మిత్రత్వం - ఉభయదేశాల మధ్య సన్నిహితత్వానికి, సుహృద్భావానికి దోహదం చేసిందన్నారు.

మిన్నుముట్టే హర్షధ్వానాల మధ్య శ్రీ బక్షీ “ప్రఖ్యాత కాశ్మీరీ జవహర్‌లాల్ నెహ్రూకి, భారత - సోవియట్ దేశాలమధ్య మిత్రత్వానికి” 'టోస్టు' చెపుతూ తనప్రసంగాన్ని ముగించారు.

పొగాకు రైతుల, వర్తకుల సభ

గుంటూరు, మార్చి 15

నేడు గుంటూరులో ట్రావెలర్సు బంగళాలో వ్యవసాయ మంత్రి శ్రీ తిమ్మారెడ్డి అధ్యక్షతన పొగాకు రైతుల, వ్యాపారుల సభ జరిగింది సభకు జిల్లాకలెక్టరు శ్రీ హలీంగారు, పొగాకు డెవలప్‌మెంట్ ఆఫీసరు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఎక్సైజ్ తదితర అధికారులు, రైతు, వ్యాపార ప్రముఖులు హాజరైనారు.

శ్రీ ఆర వీరారెడ్డి పొగాకు రైతుల యిబ్బందులను వివరిస్తూ వర్జీనియా పొగాకు రంగురాక బాగా దెబ్బతిన్నదని, పెద్ద కంపెనీలలో ఒకటైన ఐ. ఎల్ టి డి. కంపెనీ సరిగా కొనటం లేదని, తమ మాట వినటం లేదని, పొగాకు కార్మికులకు రోజుకు 3రూపాయలవరకు కూలీ యిస్తూ, గుమాస్తాలకు కార్మికులకు కాంటీను తదితర సౌకర్యాలు కలిగిస్తూ వుండటం వల్ల గిట్టుబాటు కాక రైతుకు సరైన ధర యివ్వటంలేదన్నారు

తరువాత జిల్లా రైతుసంఘ అధ్యక్షులు శ్రీ నారాయణ స్వామిగారు పొగాకు రైతుల యిబ్బందులను వివరించారు నర్సారావుపేట, ఒంగోలు, బాపట్ల తాలూకాలలో సుమారు 95 మంది వర్జీనియాపొగాకు రైతులు పెద్ద నష్టాలకు గురైనారని, ఐ యల్ టి డి కంపెనీలో గ్రేడ్ పొగాకును అసలుకొనటం లేదని, మధ్యమ గ్రేడ్ ధరలను బాగా తగ్గించివేస్తోందని, రైతులుపెద్దనష్టాలకు గురవుతున్నారని, కంపెనీ కార్మికులకు పనికూడా లేదని వెలిబుచ్చారు

శ్రీ కొల్లా వెంకయ్యగారు మాట్లాడుతూ, చిలకలూరిపేటలో యితర వ్యాపారులు యెగుమతిదారులు మాత్రమేనని, ఐ యల్ టి డి సిగరెట్ ఉత్పత్తిని చేసే యింపిరియల్ టుబాకో కంపెనీకి కంపెనీలకంటె యీ కంపెనీకి యేజెంట్లని, పొనమీద ఖర్చులు ఇతర తక్కువవుతుందని, ఐ యల్, టి. డి నిర్ణయించిన ప్రకారమే రైతులు గ్రేడ్ చేస్తున్నారని, పొరపాటు వుంటే అట్టి బేళ్ళను తిరస్కరిస్తున్నారని అన్నారు.

దానిమీదమంత్రిగారు మాట్లాడుతూ, హెచ్చుకూలీ, జీతాలవల్ల గిట్టుబాటు కాదనటంలో కొంత వాస్తవముందని, గ్రేడ్ సరిలేదనటములో అర్థంకనపడదని వెలిబుచ్చారు రైతులకు ధర వచ్చే [illegible], బొచ్చు రకాలను ఉత్పత్తి చేయటంలో తప్పులేదని, కంపెనీలు వాటిని కొనటం మంచిదేనని వెలిబుచ్చారు ధరలు తక్కువగావున్నవనేది వాస్తవమైన విషయమని, యీ విషయంలో మార్పు అవసరమని, దీన్ని ఐ యల్ టి డి. ప్రతినిధికి తెలియ వేస్తున్నామని మంత్రిగారు చెప్పారు.

పన్నులు, ఎక్సైజ్ యిబ్బందుల విషయమై అధికారులద్వారా కృషి చేస్తామన్నారు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు హైదరాబాద్ రానున్నారని, ఆ సందర్భములో రైతుల తరపున శ్రీయుతులు వీరారెడ్డి, నారాయణస్వామి గారలను తదితరులను వచ్చి వారికి వివరించమని కోరారు.

సరిహద్దు ప్రాంతాల్లో గట్టి రక్షణ చర్యలు గైకొన్నట్లు పశ్చిమ బెంగాల్ పోలీసు మంత్రి ప్రకటించారు.

తెలంగాణా ఏటా 4 వందల కొత్తస్కూళ్లు

ప్రాంతీయ కమిటీ సూచనకు ప్రభుత్వాంగీకారం

హైదరాబాద్, మార్చి 17

ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కమిటీ తీర్మానం ప్రకారం తెలంగాణాలో ప్రతి సంవత్సరం 4 వందల ప్రాథమిక పాఠశాలలు స్థాపించబడుతాయని, 5 వేల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వబడుతుందనీ, ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు శ్రీ అచ్యుతరెడ్డి నేడు పత్రికా విలేఖరులకు తెలియజేశారు.

సహకార సంఘాల విషయంలో మాత్రం ప్రాంతీయ కమిటీకి - ప్రభుత్వానికి మధ్య అభిప్రాయభేదాలున్నాయని శ్రీ అచ్యుతరెడ్డి అన్నారు

మొత్తంమీద ప్రాంతీయ కమిటీ సూచనల నన్నింటిని ప్రభుత్వం అంగీకరిస్తూ వస్తున్నదనీ, ప్రభుత్వానికి- ప్రాంతీయ కమిటీకి మధ్య గవర్నరు మధ్యవర్తిత్వం నెరపవలసిన అవసరం ఇంతవరకు కలగలేదనీ అన్నారు.

ప్రాంతీయ కమిటీ సూచనలు చేసే విషయంలో పార్టీ రాజకీయాలు ప్రమేయం రావడంలేదనీ, అన్ని పార్టీల వారు ఏకగ్రీవంగానే సూచనలు చేస్తున్నారని శ్రీ అచ్యుతరెడ్డి వెల్లడించారు.

ప్రాంతీయ కమిటీ గత ఫిబ్రవరిలో ఏర్పాటుచేయబడింది ఇప్పటివరకు ఇది 8 సార్లు సమావేశమై 9 తీర్మానాలు ఆమోదించి, సమావేశంలో ప్రతిపాదింపబడిన 28 తీర్మానాలలో 14 తీర్మానాలపై చర్చ జరిగిందనీ, వీటిలో 9 ఆమోదింపబడినవనీ, మూడు తీర్మానాలు ఉపసంహరించబడ్డాయనీ, ఒకదానిపై ఇంకా చర్చ జరుగవలసి వున్నదని తెలియజేశారు

వచ్చే సంవత్సరంనుండి తెలంగాణా ప్రాంతానికి సంబంధించినంతవరకు సాంకేతిక కళాశాలలలో విద్యార్థులు వారివారి యోగ్యతలను బట్టి చేర్చుకోవడం జరుగుతోందని, వారిని ఇంటర్వ్యూ చేసే పద్ధతికి స్వస్తి చెప్పడం జరుగుతుందని అన్నారు.

ఐరాస కార్యదర్శి హాంకాంగ్‌నుండి ఖాట్మండూ వెళుతూ దారిలో కలకత్తాలోని డమ్‌డమ్ విమానాశ్రయంలో ఆగారు

నరసింహారావు పేట యువజనసంఘకృషి

జిన్నూరు, మార్చి 8

జిన్నూరు శివారు నరసింహారావుపేటలో పేకాట ఆడుతున్నవారిని స్థానిక యువజనసంఘంవారు పాలకొల్లు పోలీసులకు అప్పజెప్పారు. పదిమంది పైన కేసు పెట్టబడింది.

తమ పిల్లలు పేకాట వగైరా దురలవాట్లకు లోనైనందుకు కొందరు పెద్దలు తలవంపుగా భావించడంలేదు. యువజనసంఘంలో చేరిన తమ బిడ్డలను కొట్టడం, తిట్టడం ప్రారంభించారు. అలా చేస్తున్న పెద్దలపై యువజన సంఘ కార్యదర్శి పంచాయితీ కోర్టులో కేసు పెట్టారు.

బజారు ధరలు

విజయవాడ, మార్చి 17

[మధ్యాహ్నం గం॥ 1 వరకు]

బంగారం ధరలు

మేలిమి · పొట్లా	120	4	0
[illegible]	119	12	0
సవరను	77	8	0
వెండి 100 తులములు	198	2	6
తులము	2	0	6

ధాన్యం ధరలు

24 నెంబరు	రు 27	8	0
వంకసన్నాలు	25	8	0
12 నెంబరు	24	8	0
అక్కుళ్ళు	23	12	0
మసూరు	24	0	0

బియ్యం ధరలు

24 నెంబరు	రు. 64	0	0
వంకసన్నాలు	60	0	0
12 నెంబరు	57	0	0
అక్కుళ్ళు	55	8	0
మసూరు	56	0	0

అపరాల ధరలు

మినుములు 240 శే॥	59	8	0
కందులు	57	0	0
నల్లపెసలు (మెట్టవి)	60	0	0
పచ్చపెసలు 280	65	0	0
పచ్చపెసలు (మెట్టవి) 60/-	63	0	0
శనగలు దేశవాళీ	64	8	0
„ (పంజాబ్) 60/-	63	8	0
ధనియాలు 26 తుంచాలు 50/55		0	0
ఉలవలు	37	0	0
ఆముదాలు	42	12	0
పంచదార (వుయ్యూరు)	110	8	0
కొబ్బరినూనె డబ్బా	88	4	0
వెల్లుల్లి మణుగు	7	0	0
బెల్లం మణుగు 4-8-0	7	4	0
మిర్చి „ 15-0-0	20	0	0
నీరుల్లి „	1-10-0		
చింతపండు „ 7-0-0	11	8	0
నువ్వులనూనె „	38	8	0
వేరుశెనగపప్పు 177 శే॥			
బుర్గయ్యపేట	64	0	0
కోడాడ	65	0	0
[illegible] మణుగు	18	4	0
కేక్ 160 శేరులు	21	8	0
కొబ్బరికాయలు 1000 కొత్త	250	0	0
	254-0-0		
పంచులు 100	98	0	0
డిటో ఫార్వర్డు	86	0	0

టెండరు నోటీసు

కృష్ణాజిల్లా గన్నవరంతాలూకా ఇందుపల్లి గ్రామ పంచాయితీకి చెందిన యీ దిగువ పేర్కొనిన పనులకు సీలు వేయబడిన టెండర్లు ప్రెసిడెంటుగారిచే 25-3-59 తేదీ లోగా కోరబడుచున్నవి. తదితర వివరములు పంచాయితీ ఆఫీసులో ఆఫీసు పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

1. చింతలతోట రోడ్డుకు క్వారీ రబ్బీష్, మెటలు తోలుట.

2 హరిజనవాడ పాయిఖానాదొడ్డి మెరక వేయుట ఎస్టిమేటు మొత్తం రు 2000/-. డిపాజిట్ రు 5/-.

3 గద్దె శ్రీరంగారావుగారి రోడ్డుకు వట్టితోలుట ఎస్టిమేటు మొత్తం రు. 416/-. డిపాజిట్ రు 5/-

(సం) కోగంటి సూర్యనారాయణ,
ప్రెసిడెంటు, ఇందుపల్లి పంచాయితీ

టెండరు నోటీసు

కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ముదునూరు పంచాయితీ యేరియాలోని యీ దిగువ తెలియజేసిన పనులకు 23-3-59 సాయంత్రం నాలుగు గంటలకు పంచాయితీ ప్రెసిడెంటుగారిచే కొటేషన్లు తీసుకొనబడును.

1 R C వైపు 6-0" పొడవు 1-0" వ్యాసము గలవి పది, 8-0" పొడవు 1-6" వ్యాసముగలవి రెండు. పంచాయితీ ఆఫీసువద్దకు సప్లయిచేయుటకు గవర్నమెంటు రిజిష్టర్డు కంపెనీలనుండిగాని లేక రిజిష్టర్డు కంపెనీలనుండి సప్లయి చేయగలవారి నుండిగాని కొటేషన్లు తీసుకొనబడును.

2 రెండు అంగుళముల మంచినీటి పంపు సామగ్రి మేలురకం మూడు సెట్లు పంపులు పంచాయితీ ఆఫీసుకు సప్లయి చేయుటకు కొటేషను ఆ రోజు కోరబడుచున్నవి.

N B వివరములు పంచాయితీ ఆఫీసు పనిచేయు కాలములో తెలుసు కొనవచ్చును

పాలడుగు సత్యనారాయణరావు
ప్రెసిడెంటు
పంచాయితీ ఆఫీసు, ముదునూరు

నిజామాబాద్ జిల్లా ప్రజల త్యాగనిరతి

కమ్యూనిస్టుపార్టీనిధికి 8 వేలు వాగ్దానం: రు 3200 రొక్కం సమర్పణ

నిజామాబాద్, మార్చి 16

కమ్యూనిస్టుపార్టీ నిధికి నిజామాబాద్ జిల్లా ప్రజలు రు. 7,889 లు వాగ్దానం చేశారు. ఇందులో రు. 3200 లు వసూలు అయినాయి. ఈ నెలాఖరుకు రు 13,000 లు సేకరించాలని జిల్లాపార్టీ నిర్ణయించింది.

పార్టీ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి పూర్తికాలం పనిచేసేందుకు కొద్దిమంది కార్యకర్తలనైనా పోషించుకోవటం అవసరమని, అందువల్ల రు 13,000 ల నిధి సేకరించడం అవసరమని భావించబడింది. నిధి వసూళ్ళు ఇప్పుడు చురుకుగా సాగుతున్నాయి.

వసూళ్ళ కార్యక్రమంలో రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శులలో ఒకరైన శ్రీ వై. వి. కృష్ణారావుగారు వివిధ గ్రామాలు తిరిగి అనేకమంది వ్యక్తులను స్వయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంలో నిజామాబాదుతాలూకా ఆంధ్రనగర్, వేల్పూర్ గ్రామాలలోనూ, బోధన్ తాలూకా కోటగిరి గ్రామాలలోనూ బహిరంగసభలు జరిగాయి. శ్రీనగరు, వర్నీ, క్రాసింగు, పంటకుర్ది, మక్లూర్‌నగర్, మాకులూరు, నిజామాబాదు పట్టణం, మాధవనగర్ గ్రామాలలో గ్రూపు సమావేశాలు జరుపబడ్డాయి. ఈ సమావేశాలలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై పార్టీ సాగించిన కార్యకలాపాలను, ప్రదేశ్ కమ్యూనిస్టు కార్యవర్గం 5 లక్షలనిధి వసూళ్ళకై యిచ్చిన విజ్ఞప్తిని వివరించారు. జిల్లాలో చాల బలహీనంగావున్న పార్టీ ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడానికి ఉదారంగా విరాళాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యకర్తలు వెళ్ళిన గ్రామాలలో అంచనాలకు తగ్గకుండా వాగ్దానాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు వచ్చిన వాగ్దానాలు, జరిగిన వసూళ్ళు యీ క్రింది విధంగా వున్నాయి.

నిజామాబాదుతాలూకా మాకులూరు వాగ్దానం రు 1500 (వసూలు రు 415), ఆంధ్రనగర్ వాగ్దానం రు 853 (వసూలు రు 160), మాధవనగర్ వాగ్దానం రు 215 (వసూలు రు 215), ధర్మవరం వాగ్దానం రు 755 (వసూలు రు 235), నవీపేట ప్రాంతం వాగ్దానం రు 500 (వసూలు రు 500), నిజామాబాదు పట్టణం వాగ్దానం రు 175 (వసూలు రు 175) మొత్తం వాగ్దానాలు రు 3,998 (వసూలు రు 1800)

బోధన్ తాలూకా బోధన్, గంజు మక్లూర్‌నగర్ వాగ్దానం రు 505, (వసూలు రు 50), పంటకుర్ది వాగ్దానం రు 568, (వసూలు రు 91), సిద్దాపురం వాగ్దానం రు 325, (వసూలు రు 50), ఎత్తొండ వాగ్దానం రు 516, (వసూలు రు 416), శ్రీనగర్ వర్నీ క్రాసింగ్ రు 550, (వసూలు రు 195), అంగరక ఫారమ్ వాగ్దానం రు 45, యక్లాసుపురం వాగ్దానం రు 180, (వసూలు రు 100), కొత్తపల్లి వాగ్దానం రు 35, నాగేంద్రపురం వాగ్దానం రు 12, కోటగిరి వాగ్దానం రు 155, మొత్తం వాగ్దానాలు రు 2891 (వసూలు రు 905)

జిల్లాలో ఇతరతాలూకాల, ప్రదేశాలలో వాగ్దానం రు 1000 (వసూలు రు 420)

పైన వివరించిన విధంగా మొత్తం 7889 రూపాయలు వాగ్దానం చేయబడ్డాయి. ఇందులో రు 3,200 లు వసూలయింది.

ఈ నెల 11 న మాధవనగర్‌లో జరిగిన జిల్లాపార్టీ కార్యవర్గ సమావేశంలో ఇంతవరకూ జరిగిన వసూళ్ళ కార్యక్రమాన్ని సమీక్షించుకున్న తరువాత కార్యక్రమం నిర్ణయించబడింది. మార్చి నెలాఖరుకు పార్టీ నిధి వసూళ్ళ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని, అందుకుగాను పార్టీ ముఖ్యులతో దళాలు వివిధ గ్రామాలు తిరగాలని కార్యక్రమం వేసుకోబడింది.

నిజామాబాదు తాలూకాలో ఒక దళంలో జిల్లా కార్యదర్శి శ్రీ సుంకర వెంకట్రామయ్యగారు, పార్టీ నాయకుడు శ్రీ పోలయ్యగారు వుంటారు. బోధన్ తాలూకాలో శ్రీ వేమూరి బాలయ్యగారి నాయకత్వాన ఒకదళం, శ్రీ వేములపల్లి వెంకటదాసు, శ్రీ పాట్లూరి ప్రకాశరావుగార్ల నాయకత్వాన మరొక దళం షుమారు 20 గ్రామాలు తిరగాలని నిర్ణయించబడింది. జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీ దేవినేని సుబ్బారావుగారు ఎల్లారెడ్డి తాలూకాలో వసూళ్ళకు తోడ్పడతారు. ఈ విధంగా మార్చి నెలాఖరుకు అనుకున్న ప్రకారం 13 వేలు వసూలు చేయాలని నిర్ణయించబడింది.

రేడియో

గురువారం, మార్చి 19

విజయవాడ

ఉదయం 6-30 సుభోదయం, 6-35 వాద్య సంగీతం, 6-40 భక్తిరంజని, 7-0 తెవార్తలు, 7-15 శమస్తానయ్య నాదస్వరం, 7-45 సంగీత శిక్షణ, మధ్యాహ్నం 12-30 హరి త్యాగశంకరరామనరసింహశాస్త్రి, 1-0 కార్మికుల కార్యక్రమం, 1-30 శమస్తానయ్య నాదస్వరం, సాయంత్రం. 6-0 స్థానిక ప్రకటనలు 6-15 గ్రామస్థులకు, 7-0 తెవార్తలు, 7-15 గ్రామస్థులకు 7-30 రసమయి, 7-45 రాగం, తానం, పల్లవి, 8-40 శాస్త్రీయసంగీతం, 9-15 లలితసంగీతం బూర్గుల రామమూర్తి, 10-0 హరి త్యాగ శంకర రామ నరసింహ శాస్త్రి, 10-30 ప్రసార సమాప్తి

హైదరాబాద్-బి

ఉదయం 6-30 సుప్రభాత్, మధ్యాహ్నం 12-30 ఎమ్. ఎస్. మహాదేవన్, 1-0 కార్మికులకు, 2-10 శాస్త్రీయ సంగీతం, 2-20 శ ఎమ్ బేగ్, దాద్రా, సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు 6-15 గ్రామస్థులకు, 7-0 తె వార్తలు 7-15 గ్రామస్థులకు 7-30 రసమయి (విజయవాడ నుండి రిలే), 9-15 లలిత సంగీతం బూర్గుల రామమూర్తి(విజయవాడనుండి రిలే) 10-30 ప్రసార సమాప్తి

హైద్రాబాద్ జిల్లా కమ్యూనిస్టు మహాసభ

ఇబ్రహీంపట్నం, మార్చి 15

హైద్రాబాద్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ మహాసభ మార్చి 5,6,7 తారీఖులలో జరిగింది. వికారాబాదు, పర్గి, మేంచల్ తాలూకాల నుండి 50 మంది ప్రతినిధులు వచ్చారు.

రాష్ట్ర నాయకులు శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణగారు రాజకీయ నివేదికను సమర్పించారు. తరువాత జిల్లా కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు.

మహాసభలో ఈ దిగువ తీర్మానాలు ఆమోదించబడినవి.

హైద్రాబాద్ జిల్లాలో బీడు భూములు చాల ఎక్కువగా వున్నవి. ఆ బీడు భూములను పేదప్రజలకు పంచాలి.

భూస్వాములు నేటికీ యధేచ్ఛగా సాగిస్తున్న కౌల్దార్ల బేదఖల్లను అరికట్టాలి.

పూర్వపు హైద్రాబాద్ ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట పరిమితికి మించిన భూస్వాముల భూములను వెంటనే పంపకం చేయాలి.

వ్యవసాయకంగా వెనుకబడివున్న ప్రాంతము, నీటివనరులులేని ప్రాంత మగుటవలన, చిన్న, పెద్ద నీటిపారుదల పథకాలను ఆ ప్రాంతంలో విరివిగా అమల్లో పెట్టాలి. బావులకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయాలి.

రోడ్లను వేయించి ప్రజలకు సౌకర్యం కలుగచేయాలి.

డీసల్ ఆయిల్ ధరను బస్సులకు సరఫరా చేసే రేట్లకు రైతులకు సరఫరా చేయాలి.

తాండూరు తాలూకా, మారేపల్లి గ్రామంలో పెంగాణి పరిశ్రమకు, సిమెంటు పరిశ్రమకు కావలసిన ముడి పదార్థాలు లభిస్తాయి. కాబట్టి ప్రభుత్వం వెంటనే ఆ ప్రాంతంలో పరిశీలన చేయించాలనీ, లోగడ తిరుమల్‌రావుగారు సహకార సిమెంటు పరిశ్రమ స్థాపనకు చేసిన ప్రయత్నాలకు ప్రభుత్వం దోహదమివ్వాలని కోరుతున్నారు.

ఈ సంవత్సరం పంటలు పాడైపోవడంవలన ఇప్పటికే ప్రజలు తిండగింజలకు కటకటలాడుతున్నారు. కాబట్టి ప్రభుత్వం ధాన్యాన్ని ప్రజలకు చౌకధరలకు సరఫరా చేయాలి.

ఇబ్రహీంపట్నం తాలూకా ప్రతినిధుల సమావేశం ప్రత్యేకంగా జరిపి, 18 గురితో తాలూకా కమిటీని, కార్యదర్శిగా శ్రీ చంటిపల్లి హనుమంతరెడ్డిగారిని ఎన్నుకున్నారు.

జిల్లా మహాసభ సందర్భంగా మార్చి 7 వ తారీఖు రాత్రి బహిరంగసభ జరిగింది. ఆసభలో శాసనసభ ప్రతిపక్షఉపనాయకుడు, శ్రీ రావి నారాయణరెడ్డిగారు, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు శ్రీ మఖ్దూం మొహియుద్దీన్‌గారు ఉపన్యసించారు. సభకు సుమారు 4 వేలమంది ప్రజలు వచ్చారు. కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. కేరళ ప్రభుత్వం పేద ప్రజలను ఎలా ఆదుకుంటూ సేవ చేస్తోందో వివరించారు.

ఆ తరువాత ఆరుట్ల వైజ్ఞానికదళం 'భూస్వామి' వీధినాటకం, గొల్లసుద్దులు ప్రదర్శించారు.

కమిటీ ఎన్నికలు

జిల్లాకమిటీ కార్యదర్శిగా శ్రీ కె. కృష్ణమూర్తిగారు కార్యవర్గసభ్యులుగా శ్రీ జి గోపాలరావు, శ్రీ సి హనుమంతరెడ్డి, శ్రీ టి వెంకటరెడ్డి, శ్రీ జి. హనుమంతరావుగారలను ఎన్నుకున్నారు. శ్రీయుతులు టి అరివయ్య కె కోటప్ప, కె వినోబ, కె జంగారెడ్డి, మహమ్మద ఇబ్రహీం‌సలీమ్, గుజ్జరి భూమయ్య, జి. రంగదాసు, ఇ రానీసింగ్, శిల్వేరు మాణిక్యాలరావు, రఘువీరగౌడ్ గారలు జిల్లా కౌన్సిలు సభ్యులుగా ఎన్నికైనారు.

కమ్యూనిస్టులపై కేసు కొట్టివేత

దేవరకొండ, మార్చి 15

దేవరకొండ తాలూకా చింతపల్లి ఫిర్కాలోని భూస్వామ్యవ్యవస్థ ఇందుర్తి గ్రామంలో కిష్టారెడ్డి ఎడ్ల కొట్టం తగులపెట్టుకొని తాలూకా కమ్యూనిస్టు కమిటీ సభ్యుడు శ్రీ సామయ్యారెడ్డి, మరో నల్గురిపై బనాయించిన దొంగకేసును నల్లగొండ సెషన్సు జడ్జీ కొట్టివేశారు.

పెండ్లి కానుక

యలమంచిలి, మార్చి 15

నర్సాపురం తాలూకా యలమంచిలి గ్రామ కాపురస్తులు బొప్పన వీర సూర్యనారాయణ, తమ్మినాడి లక్ష్మి మంగగార్ల వివాహ సందర్భంలో గ్రామ కమ్యూనిస్టు పార్టీకి వరుడు రు 10 లు, వధువు రు 5 లు విరాళం ఇచ్చారు.

ఇతరులు సాగుచేసే బంజర్లకు పట్టాల ఆశచూపి రు. 4000 పుచ్చుకొన్న అధికారులు!

మదనపల్లె, మార్చి 15

మదనపల్లె తాలూకా మల్లివారిపల్లె గ్రామంలో పేదరైతులు, వ్యవసాయ కార్మికులు సాగుచేస్తున్న బంజర్లకు మధ్యతరగతి రైతుల సంతానంపేర, వారి బంధువులపేర పట్టాలిప్పిస్తామని ఆశచూపి గ్రామమునసబు, కరణం వెంకట సుబ్బయ్య, ఆక్టింగ్ కరణం జి అప్పిరెడ్డి, అసైన్‌మెంటు రివెన్యూ ఇన్‌స్పెక్టర్ చలపతి డిసెంబరు-జనవరి నెలలలో దాదాపు నాలుగు వేల రూపాయలు లంచం పుచ్చుకొన్నట్లు తెలుస్తున్నది.

గౌడసానివారిపల్లె దగ్గర పశువులు వెళ్లే దారికి కూడ పట్టా ఇప్పిస్తామని చెప్పి, అప్పిరెడ్డి డబ్బు తీసుకొన్నట్లు ఆ పల్లె ప్రజలు కలెక్టరుకు అర్జీలుపెట్టుకొన్నారు.

ఎనమలవారిపల్లె వ్యవసాయ కార్మికులు సాగుచేస్తున్న భూమిని పట్టాకు ఇప్పించేట్లు, అందుకు రు 500 ఇచ్చేట్లు ఒక అమాయక రైతుతో ఒడంబడిక చేసుకొన్నారు. అడ్వాన్సుగా రు 100 లు తీసుకొన్నారు. "బీదవారి భూమి, మనకు వద్దు" అని ఇంటిలోని పెద్దలు చెప్పిన తరువాత ఆ రైతు తన అభిప్రాయాన్ని మార్చుకొన్నాడు. తాను ఇచ్చిన రు 100 లు వాపసు చేయమని అడిగితే "నీకు డబ్బు ఇవ్వము - భూమీ ఇవ్వము" అని చెప్పారు. రైతు కుటుంబంలో కలహం చెలరేగింది. చుట్టింటి వుద్దిరెడ్డి అను పెద్ద మనిషి తనవద్దవున్న రు 100 లు ఇచ్చి, ఆ కుటుంబ కలహాన్ని నివారించారు.

మునసీఫ్, కరణం వెంకటసుబ్బయ్య అప్పిరెడ్డిని ఆక్టింగ్ కరణంగా నియమించాడు. వీరు, అసైన్‌మెంట్ రివెన్యూ ఇన్‌స్పెక్టర్‌తోకలిసి పైవిధంగా లంచాలు పుచ్చుకుంటున్నట్లు తెలుస్తున్నది.

గుంటూరు కమిటీ స్కూలులో అక్రమంగా టీచర్ల సస్పెన్షన్

గుంటూరు, మార్చి 16

శ్రీరామా కమిటీ హయ్యర్ ఎలిమెంటరీస్కూలు మేనేజిమెంటువారు పన్నెండుగురు టీచర్లను అక్రమంగా సస్పెండ్ చేశారు. స్కూలు స్థాపించినప్పటి నుండి టీచర్లుగావున్న వారిని కూడ ఈ అక్రమానికి గురిచేసారు.

శ్రీ గుడిపాటి సత్యనారాయణశర్మగారు మేనేజరుగా 1938 లో గుంటూరు సంగడిగుంటలో ఈ స్కూలు ఏర్పరచబడింది. 1958 డిసెంబరు నుండి శ్రీ శర్మగారు స్కూలు అధ్యక్షులుగా వున్నారు.

తంలో మేనేజిమెంటువారు ప్రతి టీచరువద్ద సంవత్సరానికి రు 100 లు, ప్రతి నెలా జీతంలో రు 5 లు తీసుకొనేవారు. ఈ సంవత్సరం రెండు నెలల జీతం, ప్రతినెలా జీతంలో రు 10 లు ఇవ్వాలని టీచర్లను వత్తిడి చేశారు. అందుకు ఇష్టపడనివారు ఉద్యోగాలు వదలిపెట్టి పోవాలని చెప్పారు. పదిమంది టీచర్లు ఈ విషయం పైఅధికారులకు చెప్పుకొన్నారు. అందుకు వారిని మేనేజిమెంటువారు సస్పెండ్ చేశారు. విచారించి అసంతుష్టులను కూడ పై అధికారులు ఎలాంటిచర్య తీసుకోలేదు.

ఈ స్కూలు మూడు బ్రాంచీలుగా వున్నది. పనిచేయడానికి టీచర్లు లేనందువల్ల పీటుకూరు రోడ్డులోగల ఒక బ్రాంచిని మార్చి 3 వ తేదీ నుండి మూసివేశారు.

గుడివాడ ఛైర్మన్‌కు కారు ప్రమాదం

గూడూరు, మార్చి 18

కృష్ణాజిల్లా గుడివాడ మునిసిపల్ ఛైర్మన్ శ్రీ బ్రహ్మానందంగారికుటుంబం యాత్ర ముగించుకొని గురువారం వస్తుండగా ఓజలి గ్రామ సమీపంలో, కారు ప్రక్కకు వరిగి పడిపోయింది. కారులో వున్న ఛైర్మన్ క్రిందకు దూకడంతో కారు క్రిందపడి తలకు ప్రమాదమైన దెబ్బలు తగిలినవి. వారి బంధువులకు కూడా దెబ్బలు తగిలినవి. వారిని ఆస్పత్రిలో చేర్చారు.

విజయనగరం

విజయనగరంలో బాటా షూ కంపెనీ బ్రాంచి స్థాపించి 25 సంవత్సరాలైంది. ఈ సందర్భంలో కాలేజీలలోను, హైస్కూళ్ళలోనూ, ప్రాథమిక పాఠశాలలలోనూ వ్యాసరచన పోటీపెట్టి గెలుపొందిన విద్యార్థులకు జోళ్ళను బహూకరించారు.

పేదరైతుపొట్టగొట్టి, శాసన సభ్యునికి సాగుభూమిపట్టా

గుంతకల్లు, మార్చి 16

అనంతపురం జిల్లా పాతగుంతకల్లులో బారిక చెంచయ్య అను పేద రైతు ఎన్నో ఏండ్లుగా సాగుచేస్తున్న 7 ఎకరాల 64 సెంట్ల పోరంబోకు భూమి కాంగ్రెస్ శాసన సభ్యుడు శ్రీ యం రాజారాంగారికి పట్టా యివ్వబడింది.

ఈ భూమికి దరఖాస్తు పెట్టిన వారిలో విజయా పిక్చర్సు మేనేజరు, కాంగ్రెస్‌రాజకీయ బాధితుడు అయిన శ్రీ పూర్ణానందశర్మగారుఒకరు. భూమి శ్రీ రాజారాంగారికి పట్టా ఇవ్వబడిందని తహశీల్దారు ఇటీవలనే శర్మగారికి వ్రాతమూలకంగా తెలియజేశారు.

అనేక సంవత్సరాలుగా "తోపు పోరంబోకు" గా వున్న భూమి అధికారుల చేతులమీదుగా 1958 సెప్టెంబరులో "అనాధీన పోరంబోకు" గా మారింది!

ఈ భూమి గుంతకల్లు సమీపానగల దోనిముక్కల గ్రామంలో వుంది. ఇది ప్రభుత్వానికి చెందిన "తోపు పోరంబోకు" అని రికార్డులలో పేర్కొన్నారు.

బారిక చెంచయ్య ఎన్నో ఏండ్లుగా దీనిని కష్టపడి సాగుచేస్తున్నాడు. ప్రభుత్వానికి పన్నులు, పెనాల్టీలు చెల్లిస్తూవచ్చాడు. ఈ భూమిని తనకు పట్టా ఇప్పించాలని చెంచయ్య అనేక అర్జీలు వ్రాసుకొన్నారు. పాత గుంతకల్లులోని రైతులు, పుర ప్రముఖులు అతని తరఫున ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపారు. కాని ఇది "తోపు పోరంబోకు" అని, పట్టా ఇవ్వడానికి వీలులేదని ప్రభుత్వంనుండి చెంచయ్యకు జవాబు వచ్చింది.

శ్రీ పూర్ణానందశర్మగారుకూడా ఈ భూమికోసం 1956 లో రెండు అర్జీలు పంపుకున్నారు. దీనిని పట్టా ఇవ్వటానికి వీలులేదని, వేరొక భూమిని ఎన్నుకొని, పట్టాకై వ్రాసుకోవలసిందని ఆయనకు ప్రభుత్వం తెలియజేసింది.

తరువాత రెండేండ్లకు శ్రీ రాజారాంగారు ఈ భూమి పట్టాకై అర్జీలు పెట్టుకున్నారు. గత సెప్టెంబరు నెలలో శ్రీ శర్మగారు మరల రెండు అర్జీలు పెట్టారు. వాటికి ఇటీవల సమాధానం వచ్చింది. పై భూమి శ్రీ రాజారాంగారికి పట్టా ఇచ్చినట్లు అందులో తెలియజేయబడింది.

లంచం తీసుకొన్న మొహర్రీలు బర్తరఫ్

ములుగు, మార్చి 15

వందరూపాయలు లంచం తీసుకొన్నందుకు వరంగల్లు జిల్లా ములుగు పోలీసుస్టేషన్‌కు చెందిన మొహర్రీలను ఉద్యోగం నుండి తొలగించారు.

ఇతడు అనేక కేసులలో విపరీతంగా లంచాలు కాజేశాడు. ఇది ఈ మధ్య పెరిగిపోయింది. జాకారం అనే గ్రామంలో రోడ్డుపై లారీ ప్రమాదాలు జరిగి తొమ్మిదినెలల పిల్లవాడు మరణించాడు. వెంటనేములుగుసబ్‌ఇన్‌స్పెక్టరు పంచనామాచేసి లారీని స్వాధీనపరచుకున్నాడు. దీనిలో మొహర్రీలు కేసు లేకుండా చేస్తానని, డ్రైవరును 100 రూపాయలు లంచం అడిగాడు. డ్రైవరు 100 రూపాయల కాగితంపై డి. యస్. పి. సంతకం చేయించి మొహర్రీలుకు ఇచ్చాడు. మొహర్రీలు లంచం తీసుకోగానే డి యస్ పి వెంటనేవచ్చి ఆ నోటు బరామదు చేయించి, వెంటనే ఉద్యోగంనుండ తొలగించారు.

వంగూరుగ్రామం పరశురామప్రీతి

రెండు లక్షలు నష్టం

ఏలూరు, మార్చి 15

ఏలూరు తాలూకా వంగూరు గ్రామంలో నిన్నరాత్రి 200 ఇండ్లకు పైగా పరశురామప్రీతి అయినాయి. ప్రజలు కట్టుబట్టలతో బ్రతికి బైటపడ్డారు. ఇరువురు వృద్ధస్త్రీలకు, ఒక కుర్రవానికి శరీరం కొద్దిగా కాలింది. ధాన్యం పురులు కాలి పాడైపోయినవి. షుమారు రెండు లక్షలవరకు నష్టం వుంటుందని అంచనావేస్తున్నారు.

కలెక్టరు వగైరా రవెన్యూ అధికారులు ఈరోజువచ్చి లెక్కలు వ్రాసుకున్నారు. ప్రజలు నిలువ నీడ లేక చేలలో మాడిపోతున్నారు. చుట్టు ప్రక్కల గ్రామస్తులు బాధితులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.

కొక్కిరేణి

ఖమ్మంతాలూకా కొక్కిరేణి గ్రామ హరిజనవాడలో నిప్పంటుకొని కరిసె గోవయ్య, గురవయ్య ఇండ్లు రెండు కాలిపోయినవి.

పక్కిరుపల్లె

కడపతాలూకా చిన్నబోడు మజరా పక్కిరుపల్లె గ్రామ హరిజనవాడలో ఈనెల 11 వ తేది నిప్పంటుకొని వాడ మొత్తం కాలిపోయింది. అందులో ఒక బిడ్డ చనిపోయింది.

హరిజనులు ఆమనికాలంలో, కూలి నాలిచేసి సంపాదించుకొన్న ధాన్యం యావత్తు కాలిపోయింది.

గోకనకొండ

గోకనకొండ గ్రామంలో ఈ నెల 13వ తేదీ నిప్పుఅంటుకొని 30 ఇండ్లు, 20 చొప్పదొడ్లు, 50 వాములు (300 బండ్లు) 40 పుట్ల ధాన్యంగల కంకుల మండెలు 10 పూర్తిగా తగులబడిపోయినవి.

అప్పుడే ఫైర్ ఇంజన్ కోసం12 మైళ్లు వెళ్ళి ఫోను యివ్వగా రావడానికి వీలు లేదన్నారు.

ఖమ్మం పట్టణంలో గృహదహనం

ఖమ్మం, మార్చి 15

ఖమ్మం పట్టణానికిచెందిన శాంతి నగరంలో శ్రీ షేక్ జిలానీగారి ఇంటని ఈ నెల 10 వ తేది రాత్రి సమయంలో కొందరు కాంగ్రెస్‌వాదులు తగులబెట్టారు. ఆసమయంలో జిలానీగారు యింటివద్ద లేనందున ఆయన భార్య, మరికొందరు కలిసి పోలీసుస్టేషనుకు వెళ్ళి చెప్పగా, పోలీసులు విచారించేదిపోయి, తిట్లు తిట్టారు.

తరువాత ఈ విషయాన్ని వివరిస్తూ జిలానీగారు పోలీసు సబిన్‌స్పెక్టరుకు సూపరిండెంటుకు దరఖాస్తు యిచ్చారు.

విద్యార్థుల క్రీడోత్సవాలు

బొబ్బిలి, మార్చి 3

బొబ్బిలి బహుళార్థ సాధక పాఠశాల మైదానంలో రీజనల్ విద్యాశాఖ డిప్యూటీ డైరక్టరు (కాకినాడ) శ్రీ రామచంద్రన్ అధ్యక్షతను ఫిబ్రవరి 20 వ తేదీన బొబ్బిలి మునిసిపల్ ప్రాంత పాఠశాలల విద్యార్థుల క్రీడోత్సవాలు జరిగాయి. 900 మంది విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఆటల అనంతరం [illegible] జరిపించబడింది. ఆటలపోటీలలో గెలుపొందిన వారికి శ్రీమతి డి సుశీలగారు బహుమతులు పంచిపెట్టారు. నారసింహాని పేట స్కూలు విద్యార్థులు "విద్యా ప్రబోధం" అను బుర్రకథ చెప్పారు.

సభలు సమావేశాలు

అనంతపురం జిల్లా వ్యవసాయ కార్మికసంఘం ఆర్గనైజింగు కమిటీ సమావేశం ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అనంతపురం జిల్లా ఆఫీసులో జరుగుతుంది. సభ్యులంతా 22 వ తేదీ ఉదయమే అనంతపురం చేరుకోవాలి.

◆ ◆ ◆

చిత్తూరు జిల్లా కమ్యూనిస్టు కార్యనిర్వాహకవర్గ సమావేశం మార్చి 30వ తేది ఉదయం 9 గంటలనుండి జిల్లా ఆఫీసులో జరుగుతుంది.

◆ ◆ ◆

నెల్లూరు పట్టణ మహిళాసంఘ సర్వసభ్య సమావేశం ఈ నెల 22 వ తేదీ సాయంత్రం 2 గంటల నుండి నెల్లూరు పర్మనెంటు ఫండు ఆఫీసులో జరుగుతుంది. కృష్ణాజిల్లా మహిళాసంఘ నాయకురాలు శ్రీమతి నాగళ్ళ రాజేశ్వరమ్మగారు సమావేశంలో పాల్గొంటారు.

* * *

తిరువూరు తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం కొండూరు బంగళాలో మార్చి 20 వ తేదీ 2½ గంటలకు జరుగుతుంది.

విజయనగరం, మార్చి 8

పద్మభూషణ, విజయగారికి విజయనగరం పురపాలక సంఘం ఆఫీసులో సన్మానం జరిగింది.



సౌఖ్యమునకు, మన్నికకు ఉత్తమమైన

జనసేవక్

బనియన్లు కొనండి

★

వ్యాపార వివరములకు

ది నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (కలకత్తా) ప్రైవేట్ లిమిటెడ్

23 రమాక్ స్ట్రీట్ - కలకత్తా

టెండరు నోటీసు

తాడేపల్లి పంచాయితీ

గుంటూరుజిల్లా తాడేపల్లి పంచాయితీ 1959-60 సం॥నకు కావలసిన యీ దిగువ వివరములు సప్లయి చేయుటకు 1959 సం॥ మార్చి నెల 26 వ తేదీ సాయంత్రము 4 గం॥ ల వరకు దిగువ సంతకము చేసినవారిచేగాని, వారికల్ల అధికారము పొందినవారిచేగాని సీల్డు టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు ఆరోజు సాయంత్రము 4½ గంటలకు తెరువబడును. తదితర వివరములు ఆఫీసు పనిచేయు కాలములో తెలిసికొనవచ్చును.

వ సెం.	టెండరు వివరము	డిపాజిట్టు మొత్తం
1	స్టేషనరీ సామానులు సప్లయి చేయుట	రు 25 లు
2	తెల్లకిరసనాయిలు, అగ్గిపెట్టెలు సప్లయిచేయుట	రు 25 లు
3	Ordinary Lighting Spare Parts సప్లయి చేయుట	రు 20 లు
4	పంచాయితీ పశువులకు పశుగ్రాసము సప్లయి చేయుట	రు. 20 లు
5	ప్రసూతి కేంద్రమునకు, పశువుల ఆసుపత్రికి కావలసిన ఫర్నిచరు సప్లయిచేయుట, మరియు ఇతర పరికరములు.	రు. 20 లు

(బి) యీ పంచాయితీకి చెందిన 1959-60 సం॥ తాలూకు యీ దిగువ వేలము పాటలు 1959 సం॥ మార్చి నెల 26 వ తేది ఉదయము 11 గంటల నుండి జరుపబడును. పాటల షరతులు, ధరావత్తులు వగైరా పూర్తి వివరములు ఆఫీసు పనిచేయుకాలములో తెలిసికొనవచ్చును.

1. మార్కెట్టు రుసుములు వసూలుచేసి కొను హక్కు.

2 కంపోస్టు ఎరువు వేలము.

తాడేపల్లి,
16—3—1959.

(సం.) యం. కోటేశ్వరరావు,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు

టెండరు నోటీసు

పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురం తాలూకా, ఆచంట పంచాయితీ ఏరియాలో చేయవలసిన యీ దిగువ నుదహరించిన పనులకై సీలు వేయబడిన టెండర్లు ది 26-3-1959 తేదీ లక్ష్మివారం సాయంకాలము 3 గంటల వరకు యీ దిగువ సంతకముచేసిన వారిచే తీసుకొనబడును. అదే రోజున సాయంకాలము 4 గంటలకు సదరు టెండర్లు తెరువబడును. ప్రతి టెండరు తోను 100 కి రు 5/- చొప్పున ధరావతు చెల్లించవలెను. టెండరు వరతులు తదితర విషయములు ఆఫీసు పనిచేయుకాలములో తెలుసుకొనవచ్చును.

వరుస సం	పనుల వివరము	ఎస్టిమేటు మొత్తం	డిపాజిట్టు
1	బండిపిచ్చయ్య యింటినుండి బండి రామయ్య యింటివరకు రస్తాలు వేయుట.	రు. 400-00	రు 20-00
2.	కాపులపాలెం రామాలయం నుండి జిల్లాబోర్డు రోడ్ వరకు మెటలు వేయుట	రు 500-00	రు 25-00
3	సంతబజారునుండి చొక్కాస్వామి యింటి వరకు మెటలు వేయుట.	రు. 810-00	రు 20-00
4.	మేకా ఈశ్వర్లు యింటనుండి యస్. ఆదెయ్య యింటివరకు మెటలువేయుట	రు. 350-00	రు 17-50
5	సాకబోయిన రామన్న యింటినుండి బండి మీరయ్య యింటవరకు మెటలు వేయుట	రు. 450-00	రు 22-50
6	చిన పేటలోని వరుగుల [illegible] కట్టుట	రు 320 00	రు 17-50
7	చి. [illegible] నిర్మించుట	రు 2000-00	రు 100-00

ఆచంట,
18-3-1959.

డి వి. సింహాద్రిరావు, బి ఎ,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, ఆచంట పంచాయితీ.

హరిజనుల పరిస్థితిలో అణుమాత్రమూ మార్పులేదు

శాసన సభలో అన్నిపార్టీలవారి విమర్శ

హైద్రాబాద్, మార్చి 16

సంఘంలో అట్టడుగున ఉన్న హరిజనుల పరిస్థితిలో ప్రభుత్వం అణుమాత్రమైనామార్పు తీసుకొనిరాలేక పోయిందని హరిజన, గిరిజన స్త్రీ సంక్షేమశాఖల పద్దుపై నేడు శాసనసభలో ప్రారంభమయిన చర్చలో అన్నిపార్టీలకు చెందిన సభ్యులు నిశితంగా విమర్శించారు.

చర్చ ప్రారంభించిన శ్రీ యం రాజేశ్వరరావు (డెమొక్రాట్) తన ప్రసంగంలో ఇలా అన్నారు

రాజ్యాంగచట్టంలో అందరికీ సాంఘిక న్యాయం చేకూర్చబడుతుందని హామీవుంది. ఐతేఏమి? ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలవల్ల ఈ హామీ నిష్ఫలప్రయోగ మవుతూవుంది.

పదిసంవత్సరాలక్రితం హరిజనులు ఏ రాజకీయ, సాంఘిక, ఆర్థికదుస్థితిలో ఉన్నారో నేడు అదేదుస్థితిలో ప్రమగ్గుతున్నారు.

అస్పృశ్యతను నిర్మూలించడానికై ప్రజల దృక్పథంలో అన్ని స్థానాలలోనూ మార్పు రావలసిన అవసరమున్నదని అంగీకరిస్తున్నాను. కాని, ప్రభుత్వస్థాయిలో ఇందుకై తీసుకోబడుతున్న చర్యలేమిటి? అని ప్రశ్నిస్తున్నాను.

ఉద్యోగులవిషయంలో హరిజనులకు నూటికన్ని స్థానాలను కేటాయించారు? కాని నూటకి ఒకస్థానమైనా హరిజనునికి ఇవ్వబడలేదని ఒక కమిటీనివేదికలో స్పష్టంచేశారు.

హరిజనులకు కేటాయించిన ఒక ఉద్యోగానికి అర్హుడైన హరిజనుడు లభ్యం కాకపోతే, అలాంటి అభ్యర్థి లభించేవరకు తాత్కాలికంగా మాత్రమే హరిజనేతరుణ్ణి ఆ ఉద్యోగంలో నియమించాలని కేంద్రప్రభుత్వం సర్క్యులర్ జారీచేసింది కాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నది.

హరిజనుల ఆర్థికపరిస్థితి బాగుపరచనిదే వారికి ముక్తిలేదు. మరి ప్రభుత్వం చేతిలోవున్న బంజరుభూములను హరిజనులకెందుకు పంచడంలేదు. ఒక్కొక్కరికి 2½ ఎకరాల చొప్పున బంజరు భూమిని పంచాలని లోగడ నిర్ణయించారు కాని ఇప్పుడు ఎకరంమాత్రమే పంచాలని ప్రభుత్వం నిర్ణయించింది అదేసమయంలో మంతెన వెంకట్రాజు వంటి రాజకీయ బాధితులకు పంచే భూమిని తలకు 5 ఎకరాల నుండి పది ఎకరాలకు హెచ్చించింది. ఎందుకీ పక్షపాతం?

భూమిలేని పేదలకు భూమి పంచడానికి కాకపోతే ఈ భూసంస్కరణ లెందుకు?

హరిజనుల కోసం ప్రత్యేక పాఠశాలలు నిర్మించి వాటికి డబ్బు ఖర్చు చేయడంకన్నా ఆ డబ్బునే హరిజనుల గృహనిర్మాణానికి ఖర్చు చేయవచ్చు హరిజనులు సవర్ణులు వెళ్ళే పాఠశాలలకే వెళతారు."

శ్రీ లింగం (కాం) హరిజన గిరిజన హాస్టళ్లను, హైస్కూళ్ళను మేనేజిమెంట్లను విమర్శించారు.

శ్రీ జి. రామునాయుడు (సోష) గిరిజనులకు భూములు యివ్వాలన్నారు.

శ్రీ వి. కూర్మయ్య (కాం) హరిజనులకు సేవచేయాలనే భావం కాంగ్రెస్ వారిలో పోయిందన్నారు సభలో 46 మంది హరిజనప్రతినిధు లున్నప్పటికీ వారికి ప్రభుత్వపాలనలో ఎట్టి పరిగణన లేదన్నారు. హరిజనులకు ప్రత్యేక హాస్టళ్ళు, స్కూళ్లు ఏర్పరచవలసిందేనన్నారు. హరిజనప్రాంతాల్లో మంచినీటి సౌకర్యాల నిమిత్తం 50 లక్షలు కేటాయించాలన్నారు

శ్రీ ఉప్పల మల్సూరు (కమ్యూ) హరిజనుల ఇండ్లస్థలాల కేటాయింపు ఒక ప్రహసనంగా తయారైందని అన్నారు. ప్రతి దశలోనూ ఉద్యోగులు అడ్డంకులు పెడుతున్నారని అన్నారు కేటాయించిన తరువాత కూడా తారుమారు చేస్తున్నారని అన్నారు తెలంగాణా గ్రామాల్లో ఇంకా వెట్టి అమలు జరుగుతోందన్నారు రాష్ట్రంలోని హరిజనహాస్టళ్ళ నన్నింటిని ప్రభుత్వం తీసుకోవాలన్నారు.

మంత్రి ప్రసంగం

హైద్రాబాద్, మార్చి 15

హరిజన, గిరిజన, స్త్రీ సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న శ్రీ యస్. బి. పి. పట్టాభిరామారావు నేడు ఈ శాఖలకు సంబంధించిన పద్దులను ప్రవేశ పెడుతూ ఏజన్సీ ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో శ్రీ మలయప్పన్ కమిటీ సూచనలను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొంటుందని అన్నారు.

ఈ ప్రాంతాలలో రహదారి సౌకర్యాలు అభివృద్ధి చేయడానికీ, వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయడానికీ, ఆసుపత్రులు, ఇళ్ళు మొదలగు సంక్షేమ కార్యక్రమాలకూ, ప్రభుత్వం పథకాలను రూపొందించి అమలుజరుపుతున్నదని మంత్రిగారు అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"గత సంవత్సరం అదివరకే వున్న 15 ప్రాథమిక పాఠశాలలకుతోడు మరో 15 పాఠశాలలను స్థాపించాము. ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో మొత్తం 50 పాఠశాలలే స్థాపించాలని నిర్ణయించబడగా, ఇప్పటికే 30 స్థాపించాము తజంగి, మంపకంబవారి పాలెములలో గిరిజనులకు వ్యవసాయ క్షేత్రాలు ఏర్పాటు చేశాము ఇది కాక గజ్జిమామిడాల వలసలో (తూర్పుగోదావరిజిల్లా) 2 లక్షల 70 వేల వ్యయంతో నూరు కుటుంబాలకు జీవనోపాధి కల్పించడానికై ఒక వ్యవసాయ క్షేత్రం ఏర్పాటు చేస్తున్నాము

ఆంధ్ర గిరిజన సహకార ఆర్థికసంస్థ కార్యకలాపాలను విస్తరింప జేయడం వల్ల, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలలో 2 వేల గిరిజన కుటుంబాలు లాభపడుతాయని అంచనా.

"చెంచుస్త్రీలకై 10 వేల రూపాయల వ్యయంతో ఒక ప్రత్యేక బ్రాంచి స్థాపించాము. వచ్చే సంవత్సరం ఒక పాఠశాల, పాఠశాలకు అనుబంధంగా విద్యార్థి వసతిగృహం, వైద్యదళం ఏర్పాటు చేయనున్నారు ఎరుకలు, ఏనాదులు, సుగాలీలకై 5 లక్షల 90 వేలు ఖర్చుచేయాలని సంకల్పించారు వీరికై గృహనిర్మాణ పథకాలను కూడా అమలు జరపాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది

"58-59 లో ఆంధ్రలో హరిజన క్రైస్తవులకు ఇవ్వబడ్డ విద్యాసౌకర్యాలను తెలంగాణాలో వారికికూడా ఇవ్వాలని నిర్ణయించాము.

హరిజనల కిచ్చే స్కాలర్‌షిప్పులకై తెలంగాణాకు మామూలుగా కేటాయించబడిన 9 లక్షల 90 వేలు కాక, మరో 4 లక్షల 90 వేలు ఖర్చుచేయాలని నిర్ణయించబడింది

హరిజనులకై కొన్నిచోట్ల గ్రామ పారిశుధ్య పథకాలు అమలు జరుపుతున్నాము. మంచినీటి బావులను త్రవ్విస్తున్నాము. మరుగుదొడ్లు నిర్మిస్తున్నాము వీటికి 4 లక్షల 34 వేలు ఆంధ్రలోనూ, 2 లక్షల 50 వేలు తెలంగాణాలోను ఖర్చవుతున్నది. హరిజనులకై ఆంధ్రలో 700 ఇళ్లు, తెలంగాణాలో 393 ఇళ్ళు నిర్మించడానికి ప్రభుత్వం సంకల్పించింది.

విముక్తిజాతులకు చెందిన విద్యార్థులకు వచ్చేసంవత్సరం 35 వేల 5 వందల రూపాయలు ఖర్చు చేస్తున్నాము.

"విముక్తిజాతులకు ఒక్కొక్కరికి 5 వందల రూపాయలు ప్రకారం 50 మందికి గ్రాంటుగా మంజూరు చేయాలని నిర్ణయించాము. ఇది గృహనిర్మాణానికై ఇవ్వబడుతుంది.

"స్త్రీరక్షణశాలలకై వచ్చే సంవత్సరం 11 లక్షల 30 వేలు కేటాయించాము ఇందులో కేంద్రప్రభుత్వం సగం భరిస్తుంది.

స్త్రీ శిశుసంక్షేమానికై బడ్జెట్‌లో 2 లక్షలు కేటాయించబడింది."

* * *

హైద్రాబాద్, మార్చి 16

ఈనెల 23 నుండి 25 వరకు జరుగుతుందని ప్రకటించిన ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం ఈ నెల 29 వ తేదీకి వాయిదా పడింది సమావేశం మార్చి 31 వ తేదీవరకు జరుగుతుంది. సమావేశం లోగడ ప్రకటించిన చోటనే జరుగుతుంది

(వి. వి.)

కావలెను

ఒక జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి భారతదేశంలోని ప్రతి బిజినెస్ సెంటర్లలోను ఇన్సూరెన్స్ వ్యాపారము సంపాదించి పెట్టుటకు మంచి ప్రాస్పెక్టస్ కలిగిన ఆకర్షణీయమైన షరతులపై కమీషను బేసిస్‌పై మేనేజర్లు కావలెను. సంవత్సరమునకు కనీసం రు 20,000/-ల ప్రీమియం సంపాదించి పెట్టగలవారు కాంటాక్టు చేయండి

పోస్టుబాక్సు నెం 2426, బొంబాయి2

ప్రకటన

బొంబాయి సిటీ సివిల్ కోర్టులో
సమ్మరీ సూట్ నెం. 2869/58.

వాది
నటవర్‌లాల్ షామల్‌దాస్ వోరా
మరియు
ప్రతివాది
కోగంటి దుర్గాప్రసాదరావు

ప్రతివాదికోగంటిదుర్గాప్రసాదరావుకు మీ పైన వాది రు 5756.12 నయాపైసలకుదావాచేసియున్నాడు. దఫా, దస్తావేజులప్రకారముగా మీరు ఇచ్చిన ఆర్డర్ల ప్రకారము వాదిచే అమ్మి సరకుసు పంపించినందుకు వాది లెక్కల ప్రకారం 1958 జూలై 16 నుండి రు. 5054.56 నయాపైసలు అసలు, దానిపై సాలుకు 9% చొప్పున వడ్డీ దావా తీర్పు తేదీవరకున్నూ, మరియు దావాఖర్చులున్నూ, మరియు 5054 56 నయాపైసలపై సాలుకు 4% చొప్పున వడ్డీతో తీర్పు తేదీనుండి మీరు చెల్లించు వరకున్నూ మీ వద్ద నుండి రావలసిన సొమ్ముకు దావా చేసియున్నాడు. ఈ ప్రకటన తేదీనాటి నుండి పదిరోజుల లోగా మీరుకోర్టులో హాజరు కావలెను. అలా కానిచో పదిరోజుల తర్వాత రు 5756-12 న. పైసలు, ఖర్చులకు, కోర్టువారి ఉత్తర్వు ప్రకారం వడ్డీతో సహా వాది డిక్రీ పొందగలవాడని మీకు నోటీసు చేయడమైనది. మీరు హాజరైనచో, వాది తీర్పు నిమిత్తం తీర్పు తేదీనాడు మీకు సమన్సు పంపించగలవాడు అప్పుడు దావాను మీరు వాదించుకొనుటకై కోర్టువారిని అనుమతి పొందుటకు మీరు వాక్కు కలిగియున్నారని కూడ మీకు నోటీసు చేయడమైనది

ఎ పి. యాగ్నిక్,
ఫర్ రిజిస్ట్రార్, 10-3-1959.

శూలహారిణి



పరిణామ శూలలకు
లేక
కడుపు నొప్పులకు
For Gastric & Duodenal Ulcers
ప్రసిద్ధిగాంచిన
దివ్యౌషధము
పై శూలహారిణి కనిపెట్టినవారును,
కడుపునొప్పులకు స్పెషలిస్టు గారైన
డా॥ పి. సుబ్రహ్మణ్యంగారు
1959 మార్చి నెలలో యీ క్రింది విధముగా మకాము చేతురు
రాజమండ్రి 20 వ తేదీ,
నాగవరపు బుచ్చి అబ్బాయిగారి సత్రం
ఏలూరు: 22 వ తేదీ,
కేసరిపల్లి ఆంజనేయులుగారి సత్రం
విజయవాడ 24 వ తేదీ,
మోడరన్ కేఫ్, గవర్నరుపేట
పాలకొల్లు 26 వ తేదీ,
మహాత్మా లాడ్జింగ్, మెయిన్‌రోడ్
గుంటూరు 28 వ తేదీ,
శ్రీకృష్ణలంచ్‌హోమ్, స్టేషన్‌రోడ్
నెల్లూరు 29 వ తేదీ
శ్రీ కన్యకాపరమేశ్వరీ సత్రం
హెడ్ ఆఫీసు
అనుభవ వైద్యశాల, నెల్లూరు

విళంబినామ సంవత్సర
చాంద్రమాన ఫాల్గుణమాసం
శుద్ధ నవమి పూర్తి
ఆశ్లేష రా 1-33

విజయవాడలో స్త్రీల కళాశాల

వీలుపడదని విద్యామంత్రి ప్రకటన

హైద్రాబాద్, మార్చి 16

గుంటూరులో 20 మైళ్ళ దూరంలో ఒక స్త్రీల కళాశాలవున్నందువల్ల విజయవాడలో మరో స్త్రీల కళాశాల నెలకొల్పడం సాధ్యంకాదని విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావుగారు నేడు శాసనసభలో తెలియజేశారు విద్యా పద్దులపై చర్చకు సమాధానం యిస్తూ ఆయన పై విషయం వెల్లడించారు.

(వి.వి.)

మతం మార్పు కార్యకలాపాలు

ఉద్యోగులు పాల్గొనరాదని కేంద్ర ప్రభుత్వ ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 16

ప్రభుత్వోద్యోగులు మతం మార్పు కార్యకలాపాలలో పాల్గొనగూడదని కేంద్రప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీ చేసింది.

ఏ ప్రభుత్వ ఉద్యోగికూడా ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని తన అధికారపదవిని పలుకుబడిని, మతకార్యకలాపాలకొరకు వినియోగించరాదని, అట్లా వినియోగించిన ఉద్యోగిపై క్రమశిక్షణ చర్య తీసుకోబడుతుందని ఉత్తర్వు తెలియజేసింది

'పాక్ - అమెరికా సైనికసంధి అత్యంత ప్రమాదకరం

భారతరాయబారి శ్రీ చాగ్లా ప్రకటన

న్యూయార్కు, మార్చి 15

అమెరికా, పాకిస్థాన్ దేశాలమధ్య జరిగిన ద్విపక్షసైనిక సంధి, భారత, పాకిస్థాన్ దేశాల సంబంధాలను మరింత క్లిష్టంచేసిందనీ, ఇప్పుడీ సైనికసంధి వలన భారతదేశానికి ప్రమాదం మరింత ఎక్కువైందనీ అమెరికాలో భారతదేశ రాయబారి శ్రీ చాగ్లా నేడిక్కడ ఒక టెలివిజన్ గోష్టిలో చెప్పారు

ఆ గోష్టిలో జాతీయ, అంతర్జాతీయ విద్యార్థి నాయకులు పాల్గొని శ్రీ చాగ్లాను కొన్ని ప్రశ్నలు వేశారు

"భారత, అమెరికా దేశాలమధ్య సంబంధాలు ఇప్పుడు చాలబాగున్నవి. అలాంటప్పుడు అమెరికా భారతదేశానికి హానికలిగేట్టుగాగాని, లేక బాధాకరంగావుండేటట్లుగాగాని చేయడమనేది దురదృష్టకరమయిన సంగతి. ఆ విధంగా అమెరికా భావించక పోయినా, అమెరికా చేసిన పని ఫలితం మాత్రం అదే"నని శ్రీ చాగ్లా అన్నారు.

"ఈ సైనిక సంధిపట్ల భారతదేశ నిరసనకు అమెరికా సమాధానమిస్తూ, ఆ సంధి అంతర్జాతీయ కమ్యూనిజాన్నుండి పాకిస్తాన్‌ను రక్షించేందుకు ఉద్దేశించబడిందేనని స్పష్టంచేసింది. కాని, ఇండియా దురాక్రమణకు వ్యతిరేకంగా అమెరికా సైనిక సహాయాన్ని వినియోగిస్తానని పాకిస్తాన్ ప్రకటించింది.

"దురాక్రమణ అనేది చాల విస్తృతమైనమాట. హిట్లరు కూడ ఆమాటను పోలిష్ ప్రజలపైన ఉపయోగించాడు. దురాక్రమణ ఆరోపణ ప్రతికక్షులపై ఆరోపించకుండా ప్రపంచచరిత్రలో యుద్ధాన్ని ఎవరూ తలపెట్టలేదు" అని కూడ ఆయన అన్నారు.

"ఈ సంధిపై పాకిస్థాన్ అధికారి వ్యాఖ్యదృష్ట్యా, సరిహద్దులో జరుగుతున్న సంఘటనల దృష్ట్యా అమెరికా సైనికసంధి ప్రమాదం మరింత ఎక్కువైంది" అని అన్నారు.

కాశ్మీరు సమస్యను గురించి ప్రస్తావిస్తూ, పాకిస్తాన్ తనఆక్రమణకిందఉన్న ప్రదేశాన్ని ఖాళీచేయాలని, భారతదేశ వ్యతిరేక ప్రచారం మానాలనీ, అప్పుడే 'జనవాక్య సేకరణ' విషయం పాకిస్తాన్ మాట్లాడితే సమంజసంగా ఉంటుందనీ అన్నారు.

"ఎవరు దురాక్రమణ చేసినా సంధి వర్తిస్తుంది"

పాకిస్తాన్ ప్రభుత్వ ప్రకటన

కరాచీ, మార్చి 16

'కాశ్మీరు, కాలువ నీటిసమస్యలపైన భారతదేశం పాకిస్థాన్‌తో న్యాయమైన అంగీకారానికి రానిచో, రెండు దేశాల శాంతికి విఘాతమేర్పడే పరిస్థితి ఏర్పడవచ్చుననీ, బహుశా ప్రపంచ శాంతికికూడ భంగం కలుగవచ్చుననీ పాకిస్తాన్ ప్రభుత్వం మార్చి 23 న జరుగబోయే 'పాకిస్తాన్ దినం' సందర్భంలో ఒక అధికార ప్రకటన చేసింది

ఆ ప్రకటనలో ఇంకా యిలాఉంది

"పాకిస్తాన్‌కు రెండు పెద్ద సమస్యలున్నవి. ఒకటి కాశ్మీరు, రెండవది కాలువనీరు. పదకొండు సంవత్సరాల నుండి భారతదేశం కాశ్మీరు సమస్యా పరిష్కారాన్ని అడ్డుతోంది

జమ్మూ కాశ్మీరు సమస్య 'జనవాక్య సేకరణ' ద్వారా పరిష్కరించుకోవడానికి పది సంవత్సరాల క్రితం భారతదేశం చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని పాకిస్తాన్ కోరుతూంది

కాలువ నీటి సమస్యలోకూడ, పాకిస్తాన్ న్యాయమైన హక్కును భారతదేశం నిరాకరిస్తే, పాకిస్తాన్ ప్రభుత్వం తన ప్రజలను చూస్తూ చంపుకోలేదు. ఆ రెండు సమస్యలూ మాకు చావు బ్రతుకుల సమస్యలు అని ప్రకటించింది

సైనికసంధి, ఐ. రా. స ప్రణాళికకనుగుణంగానే ఉన్నదనీ, ఎవరు దురాక్రమణ చేసినా, ఈ సంధి వర్తిస్తుందని ప్రకటనలో ఉంది

గుంటూరులో పొగాకు గోదాము నిర్మాణం

హైద్రాబాద్, మార్చి 15

గుంటూరులో 1959-60 లో పొగాకు నిల్వకు పెద్ద గోదామును నిర్మిస్తారని, కేంద్ర గోదాములసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎన్ జి రాజ్యాదే ఇక్కడ నిన్న జరిగిన గోదాముల తృతీయ మహాసభకు అధ్యక్షత వహించుతూ తెలియజేశారు

(వి వి)

పంజాబ్ నిర్బంధ విధానంపట్ల నిరసన

తణుకు తాలూకాలో 14 గ్రామాల్లో ప్రచారం

తణుకు, మార్చి 16

పంజాబ్ రైతులపై అమలు జరుపుతున్న నిర్బంధ విధానాన్ని నిరసిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకాలో ఈ నెల 13 వ తేదీని ప్రచారయాత్ర జరిగింది. 50 మంది కమ్యూనిస్టు వాలంటీర్లు సైకిళ్లపై బయలుదేరి 14 గ్రామాల్లో పర్యటించుతూ అభివృద్ధిపన్నుకు వ్యతిరేకంగా పంజాబ్ రైతులు సాగిస్తున్న పోరాటాన్ని వివరించారు.

15 వ తేదీన తణుకులో 3 వేల మందితో బహిరంగసభ జరిగింది. సభలో పలువురు పంజాబులో నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ మాట్లాడారు. అభివృద్ధి పన్నును వాయిదావేయాలనీ, అరెస్టు చేసినవారిని విడుదల చేయాలనీ కోరుతూ తీర్మానించారు (వి. వి.)

హైద్రాబాద్ విశేషాలు

హైద్రాబాదు, మార్చి 15

"భారతదేశంలో తోలుబొమ్మలాట చాలా ప్రాచీనమైనకళ. మేము నిర్వహిస్తున్న బొమ్మలాట [illegible] మయినది భారతదేశంలో పురాతన కాలంనుండి అనూచానంగావస్తున్న జానపద సాహిత్యం పౌరాణిక గాథల్ని వినియోగించుకొంటే ఈబొమ్మలాటను ఆధునిక యుగానికి అనుగుణంగా అభివృద్ధిచేయవచ్చు. అయితే ఈ కళకు ప్రభుత్వ పోషణ అవసరం" అని మాస్కో బొమ్మలాట ప్రదర్శకుడు యస్. వి. అబ్‌రాట్‌జోవ్ ఇక్కడ పత్రికా గోష్టిలో అన్నాడు.

సోవియట్ యూనియన్‌లో వంద బొమ్మలాట ప్రదర్శనశాలలున్నవని, వీటిలో హెచ్చుభాగం పిల్లల కోసం పనిచేస్తున్నవని అబ్‌రాట్‌జోవ్ అన్నారు. కాని, త్రాగుడుబోతుతనం మొదలగు అవగుణాలను ఖండించే వ్యంగ్యప్రదర్శనాలను పెద్దవారికైకూడ యిస్తున్నట్లు అబ్‌రాట్‌జోవ్ వెల్లడించారు. సోవియట్ యూనియన్‌లోని ఈ ప్రదర్శనశాలల్లో 360మంది ప్రేక్షకులు కూర్చోవచ్చునని ఇవి ఎప్పుడూ ఖాళీగా వుండవనీ అన్నారు.

విద్యాప్రమాణాలు పడిపోవడానికి కారణాలు

శాసనసభలో ప్రస్తావన

హైద్రాబాద్, మార్చి 16

బోధనాభాషగా తెలుగును ప్రవేశ పెట్టకపోవడంవలననే విద్యాప్రమాణాలు తగ్గిపోతున్నాయని స్వతంత్ర సభ్యుడు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు నేడు విద్యా పద్దుపై చర్చను ముగించుతూఅన్నారు

ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీల ఆర్థిక అవసరాలను నిర్లక్ష్యం చేస్తున్నట్టు ఒక అభిప్రాయం వ్యాపించి ఉందనీ, అందుచేత ఆ విషయంలో ప్రభుత్వం శ్రద్ధవహించాలనీ అన్నారు

నిరుద్యోగం పెరిగిపోతూంది గనుక విద్యావ్యాప్తిని అరికట్టాలనే తప్పు దోరణి వ్యాపించి ఉందనీ, ఈ అభిప్రాయాన్ని కేంద్ర విద్యామంత్రి వెల్లడించారనీ అన్నారు. నిరుద్యోగం-కేవలం విద్యావంతులలోనేగాక అన్ని రకాల ప్రజలలోనూ ఉందన్నారు జీవితానుభవం ఈ విద్యావిధానంలో మచ్చుకికూడా కనపడదన్నారు.

విద్యాబోధన ఒక దేశభక్తి యుతమైన కార్యంగా ఉపాధ్యాయులు తీసుకోవలసి వున్నప్పటికీ వారికి కనీస భృతి అయినా యివ్వవలసిన అవసరం ఉందన్నారు. కాలేకడుపులతో ఉపాధ్యాయులు విద్యాబోధన చేయలేరని అన్నారు.

హామర్‌షెల్డు కాశ్మీరు పర్యటన

న్యూఢిల్లీ, మార్చి 16

నేడు లోక్‌సభలో అయిదుగురు లోక్‌సభ సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానంగా, విదేశాంగశాఖాఉపమంత్రి శ్రీమతి లక్ష్మీమీనన్ వ్రాతపూర్వకమైన [illegible], ఐక్యరాజ్య సమితి కార్యదర్శి హామర్‌షెల్డు భారతదేశంలో సహా, ఆగ్నేయాసియా దేశాలలో అధికారయుతమైన పర్యటన చేస్తున్నారనీ, ఆయన కాశ్మీరు ఐ. రా. స. సైనిక పరిశీలక సంఘం యొక్క కార్యకలాపాలకు సంబంధించిన అధికార విషయ సందర్భంలో వెడుతున్నారు గాని, కాశ్మీరు సమస్య పరిశీలనకై కాదని చెప్పారు.

* * *

మద్రాసు ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుండి 5 వ తరగతి వరకు ఉచితవిద్య వచ్చే సంవత్సరం నుండిపెట్టనున్నారు.

LEARN COST ACCOUNTING

An Institution to train up candidates for examinations in cost Accunting opened in Vijayawada Classes will start from middle of April Admissions limited Please write or contrct, K C Sarma, B Com(Hons) A I C W A, Cost Accounting Consultant Dr Chaganti's Bungalow, Prakasam Road, Vijayawada 2

Gas
PLANTS
FOR HEATING
IN
●INDUSTRY ●LABORATORY ●KITCHEN

Also Makers of
Superior Laboratory fittings,
Atomic Energy equipments,
Nuclear Physics equipments,
and STAINLESS STEEL
Equipments Required or Dyeing
Chemical Food Processing &
Pharmaceutical Industries.
Over 100 installations in Andhra Pradesh
Gansons Private Limited
Post Box No 5576, BOMBAY—14
DISTRIBUTORS
VIJAYA SCIENTIFIC & EQUIPMENTS
Congress Office Road VIJAYAWADA
RashtrapatiRoad SECUNDERABAD

దేశానికి ముందు ముందు పెద్ద కష్టాలున్నవట!

సహకార వ్యవసాయం, ప్రభుత్వ వర్తకం గురించి శ్రీ తిమ్మారెడ్డి బెదిరింపులు

(విశాలాంధ్ర విలేఖరి)

హైద్రాబాద్, మార్చి 15

సహకార వ్యవసాయాన్ని, ప్రభుత్వ యాజమాన్యాన వ్యాపారాన్ని ప్రవేశ పెడుతూండటంవలన దేశానికి పెద్ద కష్టాలు రానున్నాయని ప్రదేశ్ వ్యవసాయశాఖమంత్రి శ్రీ తిమ్మారెడ్డిగారు నిన్న యిక్కడ అన్నారు.

గోదాముల తృతీయ మహాసభ ఇక్కడ జరిగిన సందర్భంలో మాట్లాడుతూ శ్రీ తిమ్మారెడ్డి, "వ్యవసాయం విషయంలో వేలుపెట్టి, గొప్పవారు తమ గోయిని త్రవ్వుకుంటున్నార"ని అన్నారు

కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతుపట్ల తమ కర్తవ్యాన్ని నెరవేర్చలేక పోతున్నందుకు తాము ఎంతో విచారిస్తున్నామని శ్రీ తిమ్మారెడ్డిగారు అన్నారు

వ్యవసాయోత్పత్తికి అవుతున్న ఖర్చులను లెక్కగట్టడంలో ప్రభుత్వం చాలా భీరుత్వాన్ని ప్రదర్శిస్తున్నదని అన్నారు

పొగాకు వ్యాపారంలో వచ్చిన సంక్షోభం గురించి మాట్లాడుతూ పొగాకు ధరలు పడిపోయేటట్లు కొందరు పనిగట్టుకొని యత్నించారని అన్నారు. ఉత్పత్తిని ప్రాతిపదికగా చేసుకొని కేంద్రప్రభుత్వంపొగాకుధర నిర్ణయించుతున్నదనీ, కాని ఇదిసరియైన పద్ధతికాదని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలనుబట్టి పొగాకు ధర నిర్ణయించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పొగాకువలన యేటేటా రు. 20కోట్ల రూపాయల ఆదాయం ఎక్సైజు సుంకం రూపంలో వస్తున్నదనీ, అటువంటి సమయంలో ఉత్పత్తిదారునకు రక్షణ కల్పించకపోతే భవిష్యత్తు అంధకారంగా ఉంటుందనీఅన్నారు పొగాకువేయడంఇప్పుడు జూదం ఆడటంగా పరిణమించిందనీ, ఎక్కువ వడ్డీలకు రైతు అప్పుతెచ్చి పోస్తున్నాడని అన్నారు ఆంధ్రలో పొగాకు పంటనిల్వకు ప్రత్యేక గోదాములు వుండటం అవసరమని అన్నారు.

భారత - పాకిస్తాన్ సరిహద్దుల నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 16

లోక్‌సభలో నేడు శ్రీ శుక్లా, యింకా అయిదుగురు సభ్యులడిగిన ప్రశ్నకు విదేశాంగశాఖ ఉపమంత్రి శ్రీమతి లక్ష్మీమీనన్ సమాధానమిస్తూ 1958 నుండి పాకిస్థాన్ - భారత దేశ సరిహద్దుల విషయంలో కొంత అభివృద్ధి జరిగిందనీ, పంజాబు - పశ్చిమ పాకిస్తాన్ సరిహద్దున 318 మైళ్ల పొడవులోనూ 217 మైళ్ళ పొడవున హద్దును నిర్ణయించుకోవడం జరిగిందనీ, పశ్చిమ - బెంగాలు, తూర్పుపాకిస్థాన్ సరిహద్దులో 1350 మైళ్ళలో నూ 1158 మైళ్ళ మేరకు యింతవరకూ నిర్ణయం జరిగిందనీ చెప్పారు త్రిపురా, తూర్పు పాకిస్తాన్ హద్దులు, 522 మైళ్ళకు 70 మైళ్ళ పొడవున, అస్సాం హద్దులో 620 మైళ్ళకు 245 మైళ్ళ ఏర్పడడం జరిగిందని చెప్పారు

నిర్బంధ సేకరణ

మద్రాసు, మార్చి 16

తంజావూరు జిల్లాలో మార్చి 7 వ తేదీవరకు మొత్తం 6,544 టన్నుల ధాన్యం, 509 టన్నుల బియ్యమూ నిర్బంధసేకరణ జరిగింది.

ప్రపంచ నిపుణులు ఎన్నుకొనేది
ఫైర్‌స్టోన్
-కనుక మీరున్నూ ఎన్నుకోండి



జిమ్మీ బ్రియాన్, జగత్ప్రఖ్యాతి గన్న 'ఇండియానా పోలిస్' 500 మైళ్ళ పందెము గెలుపొందిన విజేత ఆయన 'ఫైర్‌స్టోన్' టైర్లను ఉత్తమమైనవని ప్రశంసించాడు ఆవి ఖచ్చితమైన ఆ పందెపు మార్గముమీద గంటకు 180 మైళ్ళ వేగముతో మొదటి అదురునకు, మెలివేయుటవల్ల పోయే నలుగుదుకు చెడిపోకుండా చాలా బాగుగా నిర్మించినవి మీరుకూడా అదే భద్రతను, నమ్మికను పొందవచ్చును ఎందుచేతననగా మీ కారుకు అమర్చబడే ఫైర్‌స్టోన్ టైర్లు పందెపు టైర్ల వంటివే. అదే భద్రతా నిర్మాణ లక్షణములతో నిర్మించబడినవి ఫైర్‌స్టోన్ టైర్లు ఎనిమిదిబట్టి భద్రమైనవని ఋజువుపర్చబడినవి.

Firestone
ఫైర్‌స్టోన్
డీలక్సు ఛాంపియన్
ట్యూబ్ రహితము లేక ట్యూబ్ సహితము



W 67

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షులు) కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్, కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, విజయవాడ